వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ


PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 338 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|

# చంద్రబాబుతో చర్చలకు సిద్ధం



## జలవివాదాలు చర్చలతోనే పరిష్కారం

- దీనిపై 23న మంత్రివర్గంలో నిర్ణయం
- ఏపీ, తెలంగాణ మధ్య పంచాయితీలు వద్దు
- ఏపీకి గోదావరి జలాలను మామా, అల్లుళ్లే రాసిచ్చారు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్

చంద్రబాబును ఆహ్వానిస్తాం

న్యూఢిల్లీ

జల వివాదాల పరిష్కారం కోసం ఒక అడుగు ముందుకేసి ఆంధ్రప్రదేశ్ (ఏపీ) ప్రభుత్వాన్ని చర్చలకు ఆహ్వానిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నీటి పంచాయితీలు వద్దనేదే తమ విధానమని స్పష్టం చేశారు. ఏ సమస్య అయినా కూర్చుని మాట్లాడుకుంటేనే పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈనెల 23న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించి -మిగతా 3 లో



## గీత దాటితే చర్యలు తప్పవు

- ఒకరి శాఖల్లో మరొకరు జోక్యం చేసుకోవద్ద
- జూబ్లీహిల్స్‌లో అభ్యర్థి నిలబెడతాం..
- డీసీసీ నివేదిక తర్వాత చర్యలు
- విలేకర్ల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్

హైదరాబాద్,

మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గీతదాటితే చర్యలు తప్పవని, పార్టీ నిబంధనలు ఉల్లంఘించి మాట్లాడితే సహించేది లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఒకరి శాఖల్లో మరొకరు జోక్యం చేసుకోవద్దని రాష్ట్ర మంత్రులకు తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికలపై మాట్లాడటం సరికాదని మంత్రి పొంగులేటికి స్పష్టం చేయడంతో.. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకే అలా మాట్లాడినట్టు ఆయన వివరణ ఇచ్చారని వెల్లడించారు. -మిగతా 3 లో



## ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించిన మోదీ

- మహాప్రభువు భూమికి వెళ్లడం నాకు చాలా ముఖ్యం.
- జగన్నాథుడి కోసం ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించ


భువనేశ్వర్

అమెరికా సందర్శించాలన్న ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని తాను తిరస్కరించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. పవిత్ర మహాప్రభు భూమికి తిరిగి రావాలన్న ఉద్దేశంతో అలా చెప్పానన్నారు. శుక్రవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన బీజేపీ తొలి ప్రభుత్వ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. -మిగతా 3 లో

## సన్న వడ్ల బోనస్‌పై సన్నాయి నొక్కులేనా..!

### సన్న వడ్ల బోనస్ కూడా బోగస్ అయింది..

- యాసంగిలో సన్నాల కొనుగోలు పూర్తయినా రూ. 1,161 కోట్లు బోనస్ ఇంకా విడుదల చేయకపోవడం దుర్మార్గం
- అడుగడుగునా ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం బయటపడుతోంది.
- రైతు కూలీల పరిస్థితి అయితే అధోగతే.
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



హైదరాబాద్

సన్న వడ్ల బోనస్ కూడా బోగస్ అయింది.. సన్న వడ్ల బోనస్‌పై సన్నాయి నొక్కులేనా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. యాసంగిలో సన్నాల కొనుగోలు పూర్తయినా రూ. 1,161 కోట్లు బోనస్ ఇంకా విడుదల చేయకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. 4.01 లక్షల మంది రైతుల నుంచి 23.22 లక్షల టన్నుల సన్నాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బోనస్ చెల్లించలేదు. రాష్ట్రంలో పొద్దు తిరుగుడు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. సన్ ఫ్లవర్ కొనుగోలు పూర్తయి 75 రోజులు దాటినా కూడా రైతుల ఖాతా -మిగతా 3 లో



## ఇంగ్లీష్‌తో సాధికారత.. సిగ్గుచేటు కాదు

- ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పించాలి
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ

ఇంగ్లీష్ భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఆ వ్యాఖ్యలకు శుక్రవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. ఇంగ్లీష్ సిగ్గుపడే భాష కాదు అని, అది సాధికారతను కల్పించే భాష అన్నారు. ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పించాలని రాహుల్ అభిప్రాయపడ్డారు. కానీ బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఆ భాషను పేద పిల్లలు నేర్చుకోకుండా చేస్తోందని, -మిగతా 3 లో



## యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

- అది ప్రతిఒక్కరి జీవితంలోనూ భాగస్వామ్యం కావాలి
- ఎల్బీ స్టేడియంలో జరిగిన యోగా కౌంట్‌డౌన్ వేడుకల్లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

హైదరాబాద్


యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. అది ప్రతి ఒక్కరి జీవితంలోనూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. యోగా దినోత్సవం శనివారం జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో యోగా 24 గంటల కౌంట్‌డౌన్ వేడుకలను నిర్వహించారు. -మిగతా 3 లో

## బలపడుతున్న రుతుపవనాలు

- వచ్చే నాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు వాతావారణ శాఖ అంచనా


హైదరాబాద్

రుతుపవనాలు బలపడుతుండటంతో రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. తెలంగాణ, -మిగతా 3 లో



## అమెరికా అనుమతి కోసం ఎదురుచూడం

- ఇరాన్ అణు స్థావరాలన్నీ ధ్వంసం చేస్తాం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటన



న్యూఢిల్లీ,

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమతో చేతులు కలిపినా కలపకున్నా ఇరాన్‌లోని అణు స్థావరాలన్నిటినీ ధ్వంసం చేసే సామర్థ్యం తమ దేశానికి ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం ప్రకటించారు. ఫోర్డోలోని భూగర్భ అణు స్థావరంతో సహా ఇరానియన్ స్థావరాలపై దాడి చేసే ముందు అమెరికా నుంచి అనుమతి -మిగతా 3 లో

# మా కీలక సైనిక స్థావరాలపై భారత్ దాడి నిజమే

**-పాక్ ఉప ప్రధాని**



**న్యూఢిల్లీ**

ఉగ్రవాదుల్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పిన విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి 'ఆపరేషన్ సిందూర్' తో పాక్ పై భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ఆ దేశంలోని ఉగ్ర స్థావరాలు, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. అయితే, ఇన్నాళ్లూ తమకు జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకుంటూ వస్తోన్న పాక్.. తాజాగా దాన్ని అంగీకరించింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలక సైనిక స్థావరాలపై భారత్ దాడులు నిజమే అని పాక్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ తాజాగా వెల్లడించారు. రెండు కీలక ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడి చేసినట్లు ఒప్పుకున్నారు. రావల్పిండిలోని నూర్ ఖాన్ వైమానిక స్థావరం, షోర్‌కోట్ వైమానిక స్థావరాలను భారత్ లక్ష్యంగా చేసుకుందని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడుల అనంతరం తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులను చల్లార్చేందుకు సౌదీ అరేబియా రంగంలోకి దిగిందని కూడా దార్ ఈ సందర్భంగా వెల్లడించారు. జియో న్యూస్‌తో ఇషాక్ దార్ మాట్లాడుతూ.. 'మేము తిరిగి దాడి చేసేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే ఈ దాడులు జరిగాయి. భారత్ చాలా వేగంగా స్పందించింది' అని తెలిపారు. భారత్ దాడులు జరిగిన 45 నిమిషాల్లోనే సౌదీ యువరాజు ఫైసల్ బిన్ సల్మాన్ తనను వ్యక్తిగతంగా సంప్రదించారని దార్ ఈ సందర్భంగా వెల్లడించారు. సౌదీ యువరాజు తనను ఫోన్‌లో సంప్రదించినట్లు చెప్పారు. 'పాకిస్థాన్ దాడులు ఆపేందుకు సిద్ధంగా ఉందని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు తెలియజేయవచ్చా' అని తనని అడిగినట్లు దార్ వివరించారు.

# భోపాల్ లో దారుణం.. ఒకే రోజు రెండు లైంగికదాడిలు



**భోపాల్**

రోగి అయిన మైనర్ బాలికపై డాక్టర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. అదే ప్రయివేట్ మెడికల్ కాలేజీ హాస్టల్‌లోకి రాత్రివేళ చొరబడిన వ్యక్తి వైద్య విద్యార్థినిపై లైంగికదాడికి యత్నించాడు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఒకే రోజు ఈ రెండు సంఘటనలు జరిగాయి. దేవాస్ జిల్లాలోని ఉజ్జయిని రోడ్‌లో అమల్తాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రయివేట్ ఆస్పత్రి ఉన్నది. రెండు నెలల కిందట 17 ఏళ్ల బాలిక తన తల్లిదండ్రులతో కలిసి వైద్య చికిత్స కోసం 35 ఏండ్ల డాక్టర్ రూపమ్ జైన్‌ను సంప్రదించింది. కాగా, జూన్ 17న మెడికల్ చెకప్, కౌన్సెలింగ్ కోసం బాలికను ఆ ప్రయివేట్ ఆస్పత్రికి డాక్టర్ రూపమ్ జైన్ పిలిపించాడు. ఆ తర్వాత క్యాంపస్‌లోని తన నివాసానికి ఆమెను తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో డాక్టర్ రూపమ్ జైన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోక్సో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే డాక్టర్ జైన్‌పై కొన్ని ఫిర్యాదులు రావడంతో జూన్ 5న అతడ్ని తొలగించినట్లు ఆ ప్రయివేట్ మెడికల్ కాలేజీ హాస్పిటల్ డైరెక్టర్ సురేష్ తెలిపారు. మరోవైపు జూన్ 17న రాత్రివేళ అదే మెడికల్ కాలేజీ క్యాంపస్‌లోని లేడీ హాస్టల్‌లోకి ఒక వ్యక్తి ప్రవేశించాడు. ఒక రూమ్‌లో నిద్రిస్తున్న ఎంబీబీఎస్ విద్యార్థినిని కత్తితో బెదిరించి లైంగికదాడికి ప్రయత్నించాడు. అయితే సొమ్మసిల్లినట్లు ఆమె నటించింది. తాగు నీరు ఇవ్వాలని అడిగింది. ఆ వ్యక్తి వాటర్ తెచ్చేందుకు వెళ్లగా వైద్య విద్యార్థిని ఆ గది నుంచి బయటకు పరుగెత్తింది. మిగతా వారిని ఆమె అప్రమత్తం చేయగా అతడు తప్పించుకుని పారిపోయాడు. ఈ సంఘటనపై మెడికల్ స్టూడెంట్స్ నిరసన తెలిపారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# నా వీర్యదానంతో జన్మించిన 100 మందికి సంపద పంచేస్తా

**టెలిగ్రాం సీఈవో దురోవ్ ప్రకటన**

**న్యూఢిల్లీ**

టెలిగ్రాం వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్ సంచలన ప్రకటన చేశారు. ఫ్రాన్సిస్ లీ పాయింట్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తన వీర్య దానంతో జన్మించిన వంద మంది పిల్లలకు సంపదను సమంగా పంచుతానని చెప్పారు. అయితే వారికి 30 ఏండ్లు వచ్చే వరకు మాత్రం సంపదపై హక్కు లభించబోదని స్పష్టం చేశారు. తనకు ముగ్గురు జీవిత భాగస్వాములతో ఆరుగురు పిల్లలు ఉన్నారని తెలిపారు. అయితే పదిహేనేండ్లుగా తాను వీర్యదానం చేస్తున్నట్టు, తద్వారా 100 మంది పిల్లలు పుట్టినట్టు ప్రకటించారు. అయితే వీరందరినీ ఒకేలా చూస్తానని, ఎలాంటి వ్యత్యాసం ఉండదని చెప్పారు.

# ఇరాన్‌కు చైనా రహస్య సాయం..?



**న్యూఢిల్లీ**

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం ఎనిమిదో రోజుకు చేరింది. ఇరు దేశాలు పరస్పరం క్షిపణుల వర్షం కురిపిస్తున్నాయి. శుక్రవారం ఉదయం ఇరాన్‌లోని అణు స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు కొనసాగించింది. ప్రతిగా క్లస్టర్ బాంబులతో కూడిన క్షిపణులను ఇజ్రాయెల్‌పైకి టెహ్రాన్ ఎక్కుపెట్టింది. రెండు దేశాల మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇక ఈ యుద్ధంలో ప్రపంచ దేశాలు ఇజ్రాయెల్‌కు మద్దతు పలుకుతున్న విషయం తెలిసిందే. దీంతో ఇరాన్ ఒంటరైంది. ఈ క్రమంలో ఇరాన్‌కు చైనా సాయం చేస్తున్నట్లు తెలిసింది. ఇజ్రాయెల్‌తో యుద్ధంలో ఇరాన్‌కు చైనా రహస్యంగా ఆయుధాలు పంపుతున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. మూడు మిస్టరీ కార్గో విమానాలను టెహ్రాన్‌కు పంపినట్లు తెలిసింది. ఈనెల 14 నుంచి మూడు బోయింగ్-747 విమానాలు చైనాలోని వివిధ ప్రాంతాల నుంచి టెహ్రాన్ వైపు వెళ్లినట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. పలు నివేదికల ప్రకారం.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరిట గత శుక్రవారం దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే అంటే శనివారం తొలి బోయింగ్ విమానం ఇరాన్‌వైపు వెళ్లింది. ఆ తర్వాత ఆదివారం రెండో విమానం, సోమవారం మూడో బోయింగ్ విమానం చైనా నుంచి బయల్దేరి వెళ్లాయి. ఈ రకమైన బోయింగ్ 747లను భారీ సైనిక పరికరాలను రవాణా చేయడానికి ఉపయోగిస్తారు. ఈ మూడు విమానాలూ కజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తుర్క్మెనిస్థాన్ వైపు నుంచి ఇరాన్ సమీపంలోని వెళ్లాయి. ఆ తర్వాత అవి రాడార్ నుంచి కనిపించకుండా పోయాయి. మూడు విమానాల తుది గమ్యస్థానం లక్సెంబర్గ్‌గా ఉన్నప్పటికీ అవి అక్కడికి వెళ్లలేదు. దీంతో అవి ఇరాన్ వైపు వెళ్లి ఉంటాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్‌తో యుద్ధంలో ఇరాన్‌కు చైనా రహస్యంగా కార్గో విమానాల్లో సైనిక పరికరాలు సాయంగా పంపుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి.


# ఓలెక్స్ లో సేల్‌కు బ్రిటన్ ఎఫ్-35 ఫైటర్ జెట్..?



**న్యూఢిల్లీ**

ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల లో ఒకటైన బ్రిటన్ దేశానికి చెందిన ఎఫ్-35 బీ (F-35B) ఇంకా కేరళ లోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టు లోనే ఉంది. సాంకేతిక కారణాలతో ల్యాండ్ అయిన ఈ ఫైటర్ జెట్ ఐదు రోజులు గడిచినా ఇంకా కేరళలోనే ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఫైటర్ జెట్‌కు సంబంధించి సోషల్ మీడియాలో ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. ప్రపంచంలోని అత్యంత ఖరీదైన, అధునాతన యుద్ధ విమానాలలో ఒకటైన ఎఫ్-35 ఓలెక్స్ లో అమ్మకానికి పెట్టినట్లు ఎక్స్‌లో పోస్టులు దర్శనమిస్తున్నాయి. దీన్ని 4 మిలియన్ డాలర్లకు అమ్మకానికి పెట్టినట్లు నెటిజన్లు పేర్కొంటున్నారు. దీంతో అంతా ఇది నిజమే అని నమ్ముతున్నారు. అయితే, ఓలెక్స్ లో మాత్రం అలాంటి పోస్టు ఏమీ లేదు. దీంతో ఇది ఫేక్ వార్త అని తేలిపోయింది. బ్రిటన్ దేశానికి చెందిన హెచ్‌ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ క్యారియర్ ఇటీవల ఇండో-పసిఫిక్ రీజియన్‌లో భారత నేవీతో కలిసి సంయుక్తంగా యుద్ధ విన్యాసాలు చేసింది. బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన ఆ నౌకలోని యుద్ధ విమానం ఎఫ్-35 ఇంధనం తగ్గడంతో ఆదివారం తిరువనంతపురంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యిందని ముందుగా వార్తలు వినిపించాయి. అయితే, ఇన్ని రోజులు అది ఇక్కడే ఉండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు తెలిసింది. ఆ ఫైటర్ జెట్‌లో సమస్యను సరిచేసిన తర్వాత తిరిగి హెచ్‌ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ పైకి చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫైటర్‌జెట్‌కు సీఐఎస్‌ఎఫ్ భద్రత కల్పిస్తున్నది. మన దేశంలో ఓ విదేశీ యుద్ధ విమానం ఐదు రోజులపాటు నిలిచిపోవడం, అందులోనూ ఎఫ్-35 లాంటి 5వ తరం స్టెల్త్‌జెట్ మోరాయించడం సాధారణ విషయం కాదు. కాగా ఈ విమానం షార్ట్ టేకాఫ్‌తోపాటు వర్టికల్ ల్యాండింగ్ అవుతుంది. అమెరికా సహా అతికొద్ది దేశాల ఎయిర్‌ఫోర్సుల వద్దే ఈ ఫైటర్ జెట్ ఉంది. ప్రస్తుతం ఇజ్రాయెల్ కూడా దీనిలోనే మరో వేరియంట్ విమానాన్ని ఇరాన్‌పై దాడులకు

# ఆ సత్తా మాకు ఉంది.. ట్రంప్ పర్మిషన్ అవసరంలేదు: నెతన్యాహు



**ఇజ్రాయెల్**

ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసే సత్తా ఇజ్రాయెల్ కు ఉందని ప్రధాని బెంజెమిన్ నెతన్యాహు దీమా వ్యక్తం చేశారు. ఫోర్డ్‌లోని భూగర్భ అణు కేంద్రంతో సహా ఇరాన్ న్యూక్లియర్ స్థావరాలపై దాడి చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు అమెరికా నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేవరకు వేచి చూడబోమని స్పష్టంచేశారు. ఇప్పటివరకు జరిపిన దాడులు కూడా అమెరికా ఆదేశాలతో చేయలేదని పేర్కొన్నారు. అయతుల్లా అలీ ఖమేనీ కారణంగా 3,500 సంవత్సరాల యూదు చరిత్ర అంతం కావడానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని తేల్చి చెప్పారు. ఇరాన్‌ను ఢీకొట్టే సామర్థ్యం ఇజ్రాయెల్‌కు ఉందని పేర్కొన్నారు. కీలకమైన లక్ష్యాలను ఛేదించగల సత్తా ఐడీఎఫ్‌కు ఉందని నెతన్యాహు స్పష్టం చేశారు. అయితే ఆపరేషన్ రైజింగ్ పేరుతో ఇరాన్ అణు స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులకు తెగబడింది. తొలి రోజే అణు వ్యవస్థలకు చెందిన కీలక శాస్త్రవేత్తను ఐడీఎఫ్ హతం చేసింది. అంతేకాకుండా ఆదేశానకి చెందిన కీలక నేతలను కూడా మట్టుబెట్టింది. ఈ దాడులతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేస్తోంది. ఇజ్రాయిల్ రక్షణ వ్యవస్థ డ్రోమ్ ను చేధించుకొని పలు ప్రాంతాలపై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. వారంరోజులపాటు పరస్పర దాడులతో ఇరుదేశాలకు ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది.

# యూపీ కొత్త కానిస్టేబుళ్లకు యోగి సర్కార్ ఝలక్



**ఉత్తరప్రదేశ్**

సర్కార్ కొలువు సాధించిన సంబరం కూడా లేకుండా కొత్తగా కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను యోగీ ప్రభుత్వం హడలెత్తిస్తుంది. డిపార్ట్‌మెంట్ నియమాలను ఉల్లంఘించే వివాదాస్పద పోస్టులను సోషల్ మీడియా వేదికగా రాసుకొచ్చిన, వాటిని పలువురికి షేర్ చేసిన శాఖపరంగా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రటకన జారీ చేసింది. ట్రైనింగ్‌లో భాగంగా పోలీస్ నియమాలతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సోషల్ మీడియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసులు కూడా సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూనే ఉంటారని, ఈక్రమంలో పలు జాగ్రత్తలు పాటించాలని ప్రకటనలో పేర్కొన్నారు. ట్రైనింగ్‌లో భాగంగా కొత్త పీసీలకు కూడా సోషల్ మీడియా గైడ్ లైన్స్‌ను అనుసరించాలన్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ సీఎం కొత్తగా ఎంపికైన 60,244 మంది పోలీసు కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేశారు. త్వరలోనే వారందరికి పోలీస్ ట్రైనింగ్ ప్రారంభకానుంది.

# బ్రిటన్ వైమానిక స్థావరంలోకి చొరబాటు

**రెండు విమానాలు ధ్వంసం చేసిన పాలస్తీనా అనుకూల కార్యకర్తలు**

**- ఖండించిన బ్రిటన్ ప్రధాని**

**లండన్**

ఆగేయ లండన్‌లో బ్రిటన్ అతిపెద్ద వైమానిక స్థావరంలోకి పాలస్తీనా అనుకూల కార్యకర్తలు చొచ్చుకువెళ్ళి విధ్వంసానికి దిగారు. ఆక్స్‌ఫర్డ్‌షైర్‌లోని రాయల్ ఎయిర్‌ఫోర్స్(ఆర్ఎఎఫ్)కి చెందిన ఎయిర్‌బేస్‌లోని రెండు విమానాలను ధ్వంసం చేశారంటూ ప్రధాని కెయిర్ స్టార్మర్ ఆ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆర్ఎఎఫ్ బ్రిజ్ నోర్టన్‌లో తమ కార్యకర్తలు పాల్పడిన విధ్వంసాన్ని చూపిస్తూ పాలస్తీనా యాక్షన్ కేంపైన్ గ్రూపు ఒక వీడియో పోస్టు పెట్టింది. ఆ స్థావరంలో వున్న విమానంపై రెడ్ పెయింట్‌ను స్ప్రే చేస్తూ, కార్యకర్తలు స్కూటర్లపై ఆ స్థావరమంతా కలియతిరగడం ఆ వీడియోలో కనిపిస్తోంది. గాజాలో జరుగుతున్న యుద్ధంలో బ్రిటన్ పాత్రను నిరసిస్తూ పాలస్తీనా యాక్షన్ గ్రూపు అనేక నిరసన కార్యక్రమాలను చేపడుతోంది. రాయల్ ఎయిర్‌ఫోర్స్ ఆస్తులను ఇలా ధ్వంసం చేయడాన్ని బ్రిటన్ రక్షణమంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారని తెలిపింది. స్థావరాన్ని పగలగొట్టుకుని లోపలకు వెళ్ళడంపై కేసు నమోదు చేశామని దర్యాప్తు చేస్తున్నామని స్థానిక పోలీసులు తెలిపారు. విదేశాల్లోని ఆపరేషన్లకు మద్దతునిస్తూ, గాల్లో నుండి గాల్లోకి ఇంధనం తిరిగి నింపుకునే కేంద్రం ఇది.

# చంద్రబాబుతో చర్చలకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఢిల్లీలో శుక్రవారంనాడాయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై మాట్లాడుతూ సముద్రంలో కలిసే గోదావరి జలాల విషయంలో వాస్తవాలు, రాజకీయాలు ముడిపడి ఉన్నాయని చెప్పారు. సముద్రంలో కలిసే జలాలపై ఏపీ, తెలంగాణ కూర్చుని మాట్లాడుకుంటే పరిష్కారం అయ్యేదన్నా రు. కానీ తెలంగాణ ప్రభుత్వాన్ని సంప్రదించ కుండా, ఏపీ సర్కార్ కేంద్రం దగ్గరకు వెళ్లడం బీఆర్ఎస్‌కు రాజకీయ ఆయుధంగా మారిందన్నా రు. ఏపీ విభజన చట్టం-2014లో రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారం కోసం అపెక్స్ కౌనిల్స్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీనిపై ఇరు రాష్ట్రాల అధికారులు, మంత్రుల కమిటీ కూడా ఉందని చెప్పారు. వీటిని కాదని ఏపీ సీఎం చంద్రబాబు గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ఫీజుబిలిటి, డీపీఆర్‌తో కేంద్రం చుట్టూ తిరగడంతో అసలు వివాదం మొదలైందన్నారు. రెండు తెలుగు ప్రాంతాలు మధ్య నెలకొన్న వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ఏ సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం అవుతుందన్నారు. అనవసరమైన వివాదాలు తమకు ఇష్టం లేదని చెప్పారు. కృష్ణా-గోదావరి జలాలపై కర్ణాటక, మహారాష్ట్రతో మాట్లాడేందుకు ఏపీతో కలిసి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని గుర్తు చేశారు.

**మనమే పరిష్కరించుకుందాం**

ప్రాజెక్టుల వారీగా చర్చించి, న్యాయ, సాంకేతిక పరంగా సమస్యల్ని పరిష్కరించుకుందామని ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సంప్రదింపుల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు తాము సిద్ధమేననీ, అయితే ఎవరి కోసమో తెలంగాణ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీటి పంపకాల అంశం గత పదేండ్లలో మరింత జటిలమయ్యాయన్నారు. రాష్ట్రానికి నీటి కేటాయింపులు తేలితే, మిగిలిన అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఏపీ సర్కార్‌కు తాము పంపే ఆహ్వానంపై బీఆర్ఎస్ చేయబోయే విమర్శలకు భయపడేది లేదన్నారు.

**మామా, అల్లుళ్ళే కారణం..**

గోదావరి జలాలను ఆంధ్రకు రాసిచ్చిందే మామా, అల్లుళ్లు(కేసీఆర్, హరీష్ రావు) అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పోలవరం నుంచి గోదావరి వరద జలాలను ఏపీకి తరలించ డానికి బీఆర్ఎస్ హయాంలోనే పునాది పడిందన్నారు. కేసీఆర్ అంగీకారం తెలపడంతో 2016, 2018లో వరద జలాలను ఏపీకి తరలించడానికి ఆనాడు అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్ రెండు జీవోలను విడుదల చేసిందంటూ వాటి ప్రతుల్ని మీడియాకు చూపారు. సముద్రంలో కలిసే 400 టీఎంసీలను పోలవరం నుంచి పెన్నా బేసిన్‌లోని సోమశిలకు మళ్లించడాని కి అవకాశం ఉందని వ్యాప్కోస్ కన్సల్టెన్సీ సంస్థ ఏపీ ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చిందన్నారు. అయితే ఆనాడు పెన్నా బేసిన్ అని చెప్పినా, నేడు బనకచర్ల అంటున్నా రెండూ ఒకటేనని చెప్పారు. ఆ తర్వాతే ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డితోనూ కేసీఆర్ గోదావరి జలాల వినియోగానికి చర్చలు జరిపారన్నారు. ఈ అంశంపై జగన్‌తో కేసీఆర్ నాలుగుసార్లు భేటీ అయ్యారని తెలిపారు. తెలంగాణ సీఎం హెూదాలో ఏపీలో పర్యటించి రాయలసీమను రత్నాల సీమను చేస్తానంటూ గోదావరి జలాల మళ్లింపునకు బహిరంగంగానే అంగీకారం తెలిపారని వివరించారు.

**బీఆర్ఎస్‌వి మోసపూరిత నినాదాలు**

నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ మోసపూరిత నినాదాలను అడ్డంపెట్టుకొని బీఆర్ఎస్ పార్టీ ఇన్ని రోజులు బతికిందన్నారు. ప్రస్తుతం చచ్చిపోయిన పార్టీని బతికించుకునేందుకు గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఆ పార్టీ సంజీవనిలా భావిస్తోందని చెప్పారు. జలాల పేరుతో మరోసారి రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టి సెంటిమెంట్ రగల్చాలని బీఆర్ఎస్ చూస్తోందన్నారు. 10 ఏండ్ల పాలనలో తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ ఏం వెలగబెట్టిందో చెప్పాలన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో చేపట్టిన ప్రాజెక్టు లకు పేరు, ఊరు, అంచనాలు మార్చారన్నారు. దోచుకునేందుకు ఈ పనులు చేశారని ఆరోపించారు.

**దేవుడే ఆశ్చర్యపోతాడు**

బీఆర్ఎస్ నేతల అబద్ధాలకు దేవుడు కూడా ఆశ్చర్య పోతాడని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శివుడి తల నుంచి నేరుగా ఎర్రవల్లి ఫాంహౌజ్‌కు గంగను దించాననీ, అక్కడి నుంచే నదులు పుట్టాయని కూడా కేసీఆర్ చెబుతారన్నారని ఎద్దేవా చేశారు. 2029 ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు మోడీకి చంద్రబాబునా యుడు అవసరం ఉందన్నారు. అలాగే చంద్రబాబు నాయుడుకు గోదావరి వరద జలాలు అవసరమనీ, తెలంగాణలో పార్టీని బతికించుకోవడానికి బీఆర్ఎస్‌కు పోలవరం-బనకచర్ల అవసరమన్నారు. అందుకే వీరంతా కలిసి కాంగ్రెస్‌ను, తనను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని చెప్పారు.

**299 టీఎంసీలకు ఒప్పుకుందే మీరు కాదా ?**

%కృష్ణా నదీ జలాల్లో 811 టీఎంసీలకు గాను, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకు ఒప్పుకుంటూ సంతకం చేసింది మాజీ మంత్రి హరీశ్‌రావే అని తెలిపారు. 2020 జనవరిలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 11వ సమావేశంలోనూ తెలంగాణకు 299 టీఎంసీలు చాలంటూ ఒప్పుకున్నారన్నారు. అలాగే కేంద్ర జలశక్తి మంత్రి నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోనూ కేసీఆర్, హరీశ్‌లు ఈ కేటాయింపు లకే కట్టుబడి రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు మేల్కొన్న హరీశ్‌రావు, 299 టీఎంసీల ఒప్పందంతో తెలంగాణ కు అన్యాయం జరుగుతోందని ఆనాటి జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాసారన్నారు. ఇందులో 2015లో జరిగిన ఒప్పందంతో తెలంగాణకు ఉరి అని ఒప్పుకున్నారని అన్నారు. అందువల్ల 811 టీఎంసీల్లో 50:50 నిష్పత్తిలో కేటాయింపులు చేయాలని కోరినట్లు చెప్పారు. కానీ తాము కృష్ణా నదిలో నదిలో 500 టీఎంసీలు బ్లాంకెట్‌గా ఇవ్వాలని కోరుతుంటే హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారన్నారు. ఆయన లెక్క ప్రకారం 50:50 నిష్పత్తిలో పంపకాలు చేసినా తెలంగాణకు వచ్చేది దాదాపు 405 టీఎంసీలే అన్నారు. అంటే హరీశ్‌రావు కన్నా తాము 100 టీఎంసీలు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నామని వివరించారు.

**కాళేశ్వరానికి రూ.96 వేల కోట్లు చెల్లించాం**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు ఇప్పటి వరకు రూ.1,27,872 కోట్ల టెండర్లు పిలవగా, రూ. 95,902 కోట్లు చెల్లించినట్లు సీఎం వెల్లడించారు. ఇంకా రూ.50 వేల కోట్ల పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అన్ని కాంపోనెంట్స్ పూర్తి కావాలంటే ప్రాజెక్ట్ వ్యయం రూ. 2 లక్షల కోట్లు చేరుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో కేవలం ఒకే సీజన్‌కు 50 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందిందని చెప్పారు.

# సన్న వడ్ల బోనస్‌పై సన్నాయి నొక్కులేనా..!

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులు జమ కాకపోవడం రైతుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అద్దం పడుతున్నది. ఒక సిద్దిపేట జిల్లాలోనే 50 శాతం రైతులకు డబ్బులు ఇవ్వలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సన్‌ఫ్లవర్ రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పంట కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వేస్తామని ప్రగల్బాలు పలికిన మంత్రి గారు. రెండు నెలలు దాటినా ఇప్పటికీ రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం శోచనీయం. వెంటనే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 1,116 కోట్ల సన్నాల బోనస్ డబ్బులతో పాటు సన్ ఫ్లవర్ రైతులకు పంట కొనుగోలు డబ్బులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతులను గోస పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ప్రతీచోట రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు అబద్ధపు హామీలు, గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన మీరు, పాలన కూడా అదే అబద్ధాలతో నడిపిస్తున్నారు. అడుగడుగునా ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం బయటపడుతోంది. రుణమాఫీ 50 శాతం రైతులకి కూడా అందలేదు. పోయిన వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టారు. యాసంగిలో రైతు భరోసా సగం మందికి కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు 15 వేల రైతు భరోసా అని చెప్పి మాట తప్పి 12,000కి పరిమితం చేశారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా అని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రైతు కూలీల పరిస్థితి అయితే అధోగతే. ఎన్నికల హామీల్లో అన్ని పంటలకు బోనస్ అని చెప్పి రైతులను మభ్యపెట్టి ఇప్పుడేమో సన్నాలకి పరిమితం చేసి ఆ సన్నాలకు కూడా ఎగనామం పెట్టారు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా, యాసంగిలో కొనుగోలు చేసిన సన్నాలకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం బోనస్ చెల్లించకపోవడం రైతులను వంచించడమే. ఎంతో కష్టపడి పంట పండించినా, అది ప్రభుత్వ కొనుగోళ్ల లేక దళారుల పాలవుతోంది. కొనుగోలు చేసిన పంటలకు డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం రైతులను మరింత దయనీయ స్థితికి నెడుతున్నది. యాసంగిలో బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తే తప్ప కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాని దుస్థితి. ఈ ప్రభుత్వ చేతగానితనం, నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. పంట పెట్టుబడి సహాయం అందించడంలో వైఫల్యం. పండించిన పంటకు గిట్టుబాటు ధర కేటాయించడంలో వైఫల్యం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో వైఫల్యం. ధాన్యం కొనుగోలు చేయడంలో వైఫల్యం. కొన్న ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రాష్ట్రంలో కొనుగోలు చేసిన సన్ ఫ్లవర్ పంటకు డబ్బులు విడుదల చేయాలని, అదేవిధంగా సన్నాలకు బోనస్ డబ్బులు కూడా విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# బలపడుతున్న రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో వర్షం కురిసే సమయంలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. తెలంగాణతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమలో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.



బంగాళాఖాతంలోని ఆవర్తన ప్రభావంతో తెలంగాణలో పశ్చిమ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయని, వీటి ప్రభావంతో శుక్రవారం అక్కడక్కడ ఉరుములు మెరుపులతో తేలికపాటి వర్షాలు కురిశాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం కూడా ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడవచ్చని అంచనా వేసింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

**గడిచిన 24 గంటల్లో ..**

గడిచిన 24 గంటల్లో నిర్మల్ జిల్లా నిర్మల్ మండల కేంద్రంలో అత్యధికంగా 2.82 సెం.మీ వర్షపాతం నమోదైంది. నిర్మల్ రూరల్‌లో 1.93 సెం.మీ, సారంగపూర్‌లో 1.02 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా సత్నాలలో 1.33 సెం.మీ, ఇచ్చోడలో 1.02 సెం.మీ, నిజామాబాద్ జిల్లా నవీపేటలో 1.32 సెం.మీ, మెండోరాలో 1.01 సెం.మీ, నిజామాబాద్ సౌత్‌లో 0.98 మి.మి చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

## గీత దాటితే చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

**జూబ్లీహిల్స్‌లో అభ్యర్థి నిలబెడతాం..**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం వల్ల జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెడతామని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో నిలబడే కాంగ్రెస్ అభ్యర్థిని తానేనని మాజీ క్రికెటర్, మాజీ ఎంపీ అజారుద్దీన్ ప్రకటించుకోవడంలో తప్పేమీ లేదని తెలిపారు. ఆ సీటు అభ్యర్థిగా ఎవరు ప్రకటించుకున్నప్పటికీ అది వారి వ్యక్తిగతమేనని, పద్ధతి ప్రకారం దరఖాస్తుల స్వీకరణ తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానమే అభ్యర్థిని ఎంపిక చేస్తుందని స్పష్టత ఇచ్చారు.

**డీసీసీ నివేదిక తర్వాత చర్యలు**

వరంగల్ కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితుల పై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని పరిశీలకులకు సూచించినట్టు చెప్పారు. ఆ రిపో ర్టు ఆధారంగా డీసీసీ నివేదిక ఇస్తుందని, దా ని ఆధారంగా క్రమశిక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

## ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించిన మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడకు రావడం కోసమే అమెరికా సందర్శించాలన్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని తాను తిరస్కరించినట్లు తెలిపారు.కాగా, రెండు రోజుల క్రితం జీ7 శిఖరాగ్ర సమావేశం కోసం తాను కెనడాలో ఉన్నట్లు మోదీ తెలిపారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు ఫోన్ చేసినట్లు చెప్పారు. 'మీరు కెనడా వచ్చారు కాబట్టి, వాషింగ్టన్‌కు రండి. మనం కలిసి విందు చేసి మాట్లాడుకుందామని ఆయన అన్నారు. అయితే ట్రంప్ ఆహ్వానానికి నేను ధన్యవాదాలు చెప్పా. మహాప్రభువు భూమికి వెళ్లడం నాకు చాలా ముఖ్యం. అందుకే ట్రంప్ ఆహ్వానాన్ని మర్యాదగా తిరస్కరించా. మహాప్రభు పట్ల మీకున్న ప్రేమ, భక్తి ఈ భూమికి నన్ను తీసుకువచ్చాయి' అని మోదీ అన్నారు.

## ఇంగ్లీష్‌తో సాధికారత.. సిగ్గుచేటు కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకంటే ప్రశ్నించడం వాళ్లకు ఇష్టం ఉండదని, సమానత్వాన్ని వాళ్లు కోరుకోవడం లేదని రాహుల్ అన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో హిందీ భాషలో రాహుల్ గాంధీ ఇవాళ ఓ పోస్టు చేశారు. ఇంగ్లీష్ భాష ఆనకట్ట కాదు అని, అదో వారధి అన్నారు.ఇంగ్లీష్ నేర్చుకోవడం సిగ్గుచేటు కాదు అని, అది సాధికారత ఇస్తుందన్నారు. ఇంగ్లీష్ గొలుసు కాదు అని, అది గొలుసుల్ని బ్రేక్ చేసే పరికరం అన్నారు. భారత దేశ పేద ప్రజలు ఇంగ్లీష్ నేర్చుకోవద్దన్న ఆలోచనలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఉన్నట్లు రాహుల్ ఆరోపించారు. మాతృభాష తరహాలోనే ఇంగ్లీష్ భాష ముఖ్యమైందని, ఎందుకంటే అది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తుందన్నారు. ప్రతి భారతీయ భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని ఆదరించాలని, అదే సమయంలో ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పాలన్నారు. ప్రపంచంతో పోటీపడాలంటే ఇండియాకు ఇదో మార్గమని, ఇది ప్రతి పిల్లవాడికి సమాన అవకాశం కల్పిస్తుందన్నారు.

## యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

(మొదటి పేజీ తరువాయి)

అందులో మాజీ రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎంపీ ఈటల రాజేందర్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ జాతీయ నేత ఖుష్బూ, సినీ నటులు సాయి దుర్గాతేజ్, తేజా సజ్జ, మీనాక్షి చౌదరి, తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు. యోగ ఆవశ్యకత గురించి చెప్పారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన అద్భుత బహుమతి యోగా అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు, ఆ దేశాధినేతలు, ఆ దేశాల ప్రభుత్వాల ఆధ్వర్యంలో యోగాను గుర్తించి, ఆచరిసు న్నారని గుర్తుచేశారు. ఇది ప్రతి భారతీ యుడు గర్వించదగిన అంశమని చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సంద ర్భంగా శనివారం విశాఖ పట్నంలో ఐదు లక్షల మందితో కలిసి యోగాలో పాల్గొ నబోతున్నందుకు సంతో షంగా ఉందన్నా రు. యోగానే ప్రథమ డాక్టర్ అనీ, సర్వరోగ నివారిణి అని నొక్కి చెప్పారు. యోగా పాటించినట్లయితే జీవితంలో మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. యోగాను ప్రతిఒక్కరూ ఆచరించాలని కోరారు.

## అమెరికా అనుమతి కోసం ఎదురుచూడం



(మొదటి పేజీ తరువాయి)

కోసం ఎదురు చూడబోమని కూడా ఆయన స్పష్టం చేశారు.ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలో తమ చేరికపై అమెరికా నుంచి ఇంకా స్పష్టమైన నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నెతన్యాహు తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మా లక్ష్యాలన్నిటినీ సాధిస్తాం. ఇరాన్‌లోని అన్ని అణు స్థావరాలపై దాడి చేస్తాం. అందుకు అవసరమైన సత్తా మాకు ఉంది అని నెతన్యాహు తెలిపారు.

## సంపాదకీయం


# ప్రైవేట్ ఈవీలను ప్రోత్సహించాలా

వ్యక్తిగత విద్యుత్ వాహనాల ప్రాముఖ్యత ఏమిటి? టెస్లాలు, బివైడిలు వాతావరణ క్లిష్ట సమస్యను తీర్చగలుగుతాయా? ఇదొక సులభమైన ప్రశ్న కాదు. సమాధానం సులువుగా చెప్పగలిగేదీకాదు. అయినప్పటికీ మానవాళిని శీఘ్రగతిన వాతావరణ విపత్తుకు చేరువచేస్తున్న హరిత గృహ వాయు (జీహెచ్‌జీ) ఉద్గారాలను నిరోధించేందుకు మరింత బృహత్తర కృషి చేయవలసి ఉన్న దృష్ట్యా ఆ ప్రశ్నను లోతుగా తర్కించడం చాలా ముఖ్యం. విద్యుత్ వాహనాలు (ఈవీ) ఎందుకు? పారిశ్రామిక యుగం తొలినాటి సంపన్న దేశాలు శిలాజ ఇంధనాల వినియోగాన్ని శీఘ్రగతిన పూర్తిగా తగ్గించుకోవల్సిన అగత్యమేర్పడింది. శిలాజ ఇంధనాలతో నడిచే (ఐసీ) ఇంజిన్ వాహనాల వినియోగాన్ని వదిలివేసేందుకు విద్యుత్ వాహనాలు దోహదం చేస్తాయని ఆ దేశాలు విశ్వసిస్తున్నాయి. రవాణా రంగంలో ఈవీల వాడకం ఇతోధికంగా పెరిగితే కాలుష్య కారక వాయు ఉద్గారాలు తగ్గిపోతాయని సంపన్న పారిశ్రామిక దేశాలు భావిస్తున్నాయి. అటువంటి పరివర్తన సుగమమయ్యేందుకు ఆ దేశాలు ఇప్పటికే నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. 2030 నాటికి నమోదయ్యే కొత్త కార్లలో 80 శాతం తప్పనిసరిగా కాలుష్యకారక వాయువులను ఏ మాత్రం ఉద్గారించనివై ఉండాలని యూరోపియన్ దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. వీటి సంఖ్య 2035 నాటికి నూటికి నూరు శాతానికి పెరగాలని కూడా ఆ దేశాలు నిర్దేశించుకున్నాయి. అమెరికాలో కూడా 2030 నాటికి నమోదయ్యే కొత్త కార్లలో 50 శాతం తప్పనిసరిగా విద్యుత్ వాహనాలై ఉండి తీరాలని మాజీ అధ్యక్షుడు జోబైడెన్ ప్రభుత్వం ఆదేశించింది. రవాణారంగాన్ని డీ కార్బనైజ్ (హరిత గృహ వాయువుల ఉద్గారాలను, ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించి అంతిమంగా వాతావరణం నుంచి పూర్తిగా తొలగించే ప్రక్రియ) చేసేందుకు విద్యుత్ వాహనాలను వినియోగించడమనేది ఈ సంపన్న పాశ్చాత్య దేశాల లక్ష్యం. ఐసీ ఇంజిన్ల వాహనాలను క్రమంగా తొలగించివేసినప్పుడు మాత్రమే ఆ లక్ష్య పరిపూర్తి సాధ్యమవుతుంది. మూడు దశాబ్దాలుగా యూరోపియన్ దేశాల రవాణా రంగంలో జీహెచ్‌జీ ఉద్గారాలు బాగా పెరిగిపోయాయి. రవాణా రంగం నుంచి వెలువడుతున్న మొత్తం ఉద్గారాలలో 60 శాతం ప్రైవేట్ కార్ల నుంచే సంభవిస్తున్నాయి. ఈ వాస్తవం దృష్ట్యానే రవాణా రంగాన్ని డీ కార్బొనైజ్ చేసేందుకు ఆ దేశాలు నిర్ణయించుకున్నాయి. రవాణా రంగంలో ఆవశ్యక మార్పును సాధించేందుకు యూరోపియన్ దేశాలు ప్రైవేట్ కారు యజమానులకు సబ్సిడీలు సమకూరుస్తాయా? లేక ఆ డబ్బును రవాణా రంగాన్ని డీ కార్బొనైజ్ చేసేందుకు, సొంత వాహనాలకు బదులు ప్రజా రవాణా వ్యవస్థలను వినియోగించుకునేలా ప్రజలకు వెసులుబాటు కల్పించేందుకు ఉపయోగిస్తాయా? సంపన్న దేశాలు ఆ రెండూ చేయగలవు. చేస్తాయి కూడా.అభివృద్ధి చెందుతున్న దేశాల విషయంలో ఈ ప్రశ్నలకు చాలా ప్రాసంగికత ఉన్నది. ఎందుకంటే మన ప్రభుత్వాలు ఆ రెండిటిలో ఏదో ఒకటి మాత్రమే చేయగలవు. ఇప్పటికే ప్రైవేట్ డీజిల్, పెట్రోల్ కార్లకు సబ్సిడీలు సమకూరుస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై పెద్ద ఆర్థిక భారం పడుతోంది. ముఖ్యమైన విషయమేమిటంటే ఈ సబ్సిడీలు ప్రత్యక్షంగా కనపడవు. అవి ఎక్కడా చర్చింపబడవు. కారు యజమానులు చెల్లించే రోడ్ పన్నునే తీసుకోండి. బస్సు ప్రయాణీకులు ఒకొక్కరు చెల్లించే పన్ను కంటే కారు ఉన్న ఆసాములు చెల్లించే పన్ను చాలా తక్కువ. రోడ్లపై 90 శాతం కంటే ఎక్కువ చోటును చిన్న కారులే ఆక్రమించుకుంటాయి. కార్లు సుగమంగా సాగేందుకు నున్నని రోడ్లు, ఫ్లైఓవర్లు, దైనందిన రాకపోకలకు అవసరమైన ఇతర సదుపాయాల నిర్మాణానికి అవసరమయ్యే ఖర్చునూ పరిగణనలోకి తీసుకుంటే ప్రైవేట్ కారు యజమానులకు భారీ సబ్సిడీ సమకూరుతుందనేది స్పష్టం. డీ కార్బొనైజేషన్, వాయు కాలుష్యం తగ్గింపు అనే మన లక్ష్యాల పరిపూర్తికి మన రోడ్లపై ప్రైవేట్ వాహనాల సంఖ్యను ఇతోధికంగా తగ్గించవలసి ఉంటుందిబీ అదే సమయంలో వాహనాల కంటే ప్రజలకు ప్రాధాన్యమిచ్చే రవాణా పద్ధతుల (నగరాలలోని రవాణా వ్యవస్థలను ప్రైవేట్ వాహనాలకు అనుగుణంగా కాకుండా ప్రజల అవసరాలకు సానుకూలంగా రూపొందించడం)కు మనం మారాలి. ఇది తప్పనిసరి. ఇందుకు మనం ఏమి చెయ్యాలి? నిర్దిష్ట కాలపరిమితిలో కాలుష్య కారకాలను ఉద్గారించని వాహనాలకు మారాలి. ఐసీ ఇంజిన్ల వాహనాలను సంపూర్ణంగా వదిలివేయాలి. ఈ విషయమై ఒక కచ్చితమైన విధాన నిర్ణయం తీసుకుని కఠినంగా అమలుపరచాలి. అప్పుడు మాత్రమే ప్రైవేట్ ఈవీల వల్ల సత్ఫలితాలు సాధ్యమవుతాయి. కేవలం విద్యుత్ వాహనాల వినియోగాన్ని గణనీయంగా పెంచినంతమాత్రాన వాయు కాలుష్యం నియంత్రణకు గానీ, వాతావరణ మార్పు నిరోధానికి గానీ దోహదం జరగదు. శుభకరమైన విషయమేమిటంటే విద్యుత్ వాహనాల విషయంలో భారత ప్రభుత్వ విధానం వాటి పట్ల పూర్తి అనుకూలత చూపడం లేదు.ప్రజా రవాణా వ్యవస్థల్లో విద్యుత్ బస్సులు ఉపయోగించేందుకు, అనుబంధ రవాణా సేవల్లో ఆటోలు మొదలైన వాహనాల విద్యుదీకరణకు సబ్సిడీలు సమకూరుస్తున్నది. అయితే ఇది మాత్రమే సరిపోదు. ఆటోలు, టాక్సీలు, బస్సులు మొదలైనవి నిర్ణీత కాలపరిమితిలో విద్యుదీకరణ అయితీరాలనే లక్ష్యాన్ని నిర్దేశించి తీరాలి. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌కే గాక, కాలం చెల్లిన వాహనాల తొలగింపునకు కూడా ఒక కచ్చితమైన కాలపరిమితిని నిర్దేశించాలి. పార్కింగ్ చార్జీలు, ప్రజా రవాణాకు మరిన్ని ప్రోత్సాహకాల కల్పన మొదలైన చర్యల ద్వారా ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని నియంత్రించాలి. ప్రైవేట్ కార్ల స్థానంలో నడక, సైక్లింగ్, బస్సులు, ట్రాములు, మెట్రోలను ప్రోత్సహించని పక్షంలో మన లక్ష్యాలను సాధించుకోలేము. మన విద్యుదీకరణ అజెండా మొబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ అజెండా (మరింత స్థిరమైన, సమర్థమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన రవాణా వ్యవస్థల దిశగా పరివర్తన)నే. అంతకు ఏమీ తక్కువ కాదు.

# పార్టీల ఎన్నికల వ్యయాల పై ఎడిఆర్ కీలక రిపోర్ట్

**న్యూఢిల్లీ**

2024 సార్వత్రిక ఎన్నికల కోసం బీజేపీ అత్యధికంగా 45 శాతం ఖర్చు చేసినట్లు అసోసియేషన్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) శుక్రవారం తెలిపింది. ఈ ఎన్నికల కోసం బీజేపీ సుమారు రూ. 1,494 కోట్లు ఖర్చు చేసిందని, మొత్తం ఎన్నికల వ్యయంలో ఇది 44.56 శాతమని పేర్కొంది. కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచిందని, ఈ ఎన్నికల కోసం కాంగ్రెస్ రూ.620 కోట్లు ఖర్చు చేయగా, మొత్తం వ్యయంలో 18.5శాతమని తెలిపింది. 32 జాతీయ, ప్రాంతీయ పార్టీల రికార్డులను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించినట్లు ఎడిఆర్ తెలిపింది. మార్చి 16 నుండి జూన్ 6 వరకు నిర్వహించిన లోక్‌సభ ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కింలలో అసెంబ్లీ ఎన్నికల కోసం ఈ పార్టీలు మొత్తంగా రూ.3,352.81కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. ఈ ఖర్చులో జాతీయ పార్టీల వాటా రూ.2,204 కోట్లు (65.75శాతం). సేకరించిన మొత్తం నిధులలో, జాతీయ పార్టీలు రూ.6,930.246 కోట్లు (93.08శాతం) సేకరించగా, ప్రాంతీయ పార్టీలు రూ.515.32 కోట్లు (6.92శాతం) సేకరించాయని నివేదిక పేర్కొంది. సార్వత్రిక ఎన్నికలు జరిగిన 90 రోజుల లోపు మరియు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 75 రోజుల లోపు రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ (ఇసి)కి వ్యయ నివేదికలను దాఖలు చేయాల్సి వుంటుంది. ఈ నివేదికలను విశ్లేషించి నివేదికను రూపొందించినట్లు ఎడిఆర్ తెలిపింది. నివేదిక సమర్పణలో తీవ్రమైన జాప్యం జరిగినట్లు ఎడిఆర్ గుర్తించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్ ) 168 రోజుల ఆలస్యంగా, బిజెపి 139 రోజుల ఆలస్యంగా నివేదికలను దాఖలు చేసినట్లు తెలిపింది. లోక్‌సభ మరియు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ మాత్రమే ఏకీకృత నివేదికను సమర్పించినట్లు స్పష్టం చేసింది.






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ప్రచారానికే అధిక ఖర్చు**

పార్టీలు ప్రకటించిన మొత్తం వ్యయంలో రూ.2,008 కోట్లు లేదా 53 శాతం కంటే ఎక్కువ ఖర్చు ప్రచారానికే చేసినట్లు నివేదిక తెలిపింది. వ్యయంలో ప్రచారం అగ్రస్థానంలో నిలిచింది. తరువాతి స్థానంలో ప్రయాణ ఖర్చులు రూ. 795 కోట్లు, అభ్యర్థులకు ఏకమొత్తం అందించినవి రూ.402 కోట్లు. పార్టీలు వర్చువల్ ప్రచారాల కోసం రూ.132 కోట్లకు పైగాఖర్చు చేశాయి. అభ్యర్థుల నేరచరిత్రలను ప్రచురించడం కోసం రూ.28కోట్లు వెచ్చించాయి. 32 రాజకీయపార్టీలు ప్రచారం కోసం చేసిన మొత్తం ఖర్చులో, జాతీయ ప ఆర్టీలు రూ.1,511.3004 కోట్లు లేదా 75.25శాతం ఖర్చు చేయగా, ప్రాంతీయ పార్టీలు రూ.496.99 కోట్లు లేదా రూ.24.75శాతం ఖర్చు చేశాయి. ప్రయాణ ఖర్చులు , స్టార్ క్యాంపెయినర్లకు భారీగా నిధులు మళ్లించినట్లు నివేదిక తెలిపింది.

# గీత దాటితే చర్యలు తప్పవు


**విలేకర్ల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాద్,**

మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గీతదాటితే చర్యలు తప్పవని, పార్టీ నిబంధనలు ఉల్లంఘించి మాట్లాడితే సహించేది లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఒకరి శాఖల్లో మరొకరు జోక్యం చేసుకోవద్దని రాష్ట్ర మంత్రులకు తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికలపై మాట్లాడటం సరికాదని మంత్రి పొంగులేటికి స్పష్టం చేయడంతో.. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకే అలా మాట్లాడినట్టు ఆయన వివరణ ఇచ్చారని వెల్లడించారు.

**జూబ్లీహిల్స్‌లో అభ్యర్థి నిలబెడతాం..**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం వల్ల జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెడతామని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో నిలబడే కాంగ్రెస్ అభ్యర్థిని తానేనని మాజీ క్రికెటర్, మాజీ ఎంపీ అజారుద్దీన్ ప్రకటించుకోవడంలో తప్పేమీ లేదని తెలిపారు. ఆ సీటు అభ్యర్థిగా ఎవరు ప్రకటించుకున్నప్పటికీ అది వారి వ్యక్తిగతమేనని, పద్ధతి ప్రకారం దరఖాస్తుల స్వీకరణ తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానమే అభ్యర్థిని ఎంపిక చేస్తుందని స్పష్టత ఇచ్చారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**డీసీసీ నివేదిక తర్వాత చర్యలు**

వరంగల్ కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితుల పై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని పరిశీలకులకు సూచించినట్టు చెప్పారు. ఆ రిపో ర్టు ఆధారంగా డీసీసీ నివేదిక ఇస్తుందని, దా ని ఆధారంగా క్రమశిక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.


# సహాయ కేంద్రం వద్ద ఇజ్రాయెల్ కాల్పులు..

**-23 మంది పాలస్తీనియన్లు మృతి**

**గాజా**

గాజా లో ఇజ్రాయెల్ మారణహోమాన్ని సృష్టిస్తోంది. గాజాలోని పలు ప్రాంతాలపై భీకర దాడులకు పాల్పడుతోంది. గాజాలోని నివాస ప్రాంతాలు, ఆసుపత్రులపై విరుచుకుపడుతోంది. తాజాగా సహాయ ట్రక్కుల కోసం ఎదురుచూస్తున్న వారిపై ఇజ్రాయెల్ కాల్పులు జరిపింది. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో పాలస్తీనియన్లు మరణించారు.గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సెంట్రల్ గాజాలోని సహాయ పంపిణీ కేంద్రం సమీపంలో సహాయ ట్రక్కుల కోసం ఎదురు చూస్తున్న వారిపై కాల్పులు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దాడిలో 23 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. 100 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం మొదలైన విషయం తెలిసిందే. 20 నెలల నుంచి జరుగుతున్న ఈ గాజా పోరులో ప్రాణాలు కోల్పోయిన పాలస్తీనియన్ల సంఖ్య 50 వేలు దాటింది. ఈ యుద్ధంలో 55,104 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మృతుల్లో సగానికిపైగా మహిళలు, బాలలు ఉన్నట్లు తెలిపింది. సుమారు 1,24,901 మంది గాయపడినట్లు పేర్కొంది. హమాస్‌ను అంతమొందించి ఆ ఉగ్రసంస్థ చెరలో ఉన్న బందీలను విడుదల చేయడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ సేనలు తెలిపాయి.

# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధం: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్: ప్రజా స్వేచ్ఛ**

గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరితోనూ వివాదాలు కోరుకోవడం లేదని, అయితే తెలంగాణ హక్కులను మాత్రం వదులుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలుత తెలంగాణను సంప్రదించకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రాథమిక సాధ్యసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్) సమర్పించడమే ప్రస్తుత వివాదానికి మూలకారణమని రేవంత్ రెడ్డి అన్నారు. "పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే మాతో చర్చించి ఉంటే ఈ వివాదం ఉండేది కాదు. కేంద్రానికి ఏపీ నివేదిక ఇవ్వగానే, కేంద్రం కూడా అన్ని రకాల చర్యలకు సిద్ధమవుతోంది" అని ఆయన వివరించారు. ఈ అంశంపై చర్చించేందుకు తమకు ఎలాంటి బేషజాలు లేవని, ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై మాట్లాడుకుందామని ఆయన సూచించారు. "ఒక రోజు కాదు, అవసరమైతే నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయి. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని, ఈ భేటీలో బనకచర్ల అంశంపై సమగ్రంగా చర్చించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్‌ను అధికారికంగా చర్చలకు ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. "ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు" అని ఆయన అన్నారు. విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు ఇప్పటికే అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసిందని ఆరోపించారు."నీళ్లు, నిధుల పేరిట బీఆర్ఎస్ నేతలు మోసపూరిత సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకున్నారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని కేసీఆర్ అన్నారు. గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కూడా గతంలో వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీశ్ రావులే" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాను కృష్ణా జలాల్లో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్ఓసీ అడిగితే మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుపడుతున్నారని, ఆయన వాదనలో పసలేదని అన్నారు. 2023లో కేంద్రానికి హరీశ్ రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు."విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది.




తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. దీనిపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. గోదావరిలో 968 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కానీ, కేటాయించిన నీటిని వాడుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదాలు తలెత్తుతున్నాయి" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాద పరిష్కారానికి ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. జూలై 6, 7 తేదీల్లో మరోసారి ఢిల్లీలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే హరీశ్ రావు విమర్శలు చేస్తున్నారని, తెలంగాణకు అన్యాయం చేసింది కేసీఆర్, హరీశ్ రావులేనని పునరుద్ఘాటించారు. కేటీఆర్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లైజనింగ్ అధికారిగా పని చేస్తున్నారని, కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, అమిత్ షా గతంలో అన్నారని గుర్తుచేశారు. దీనిపై కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ రైతులకు బిగ్ అలర్ట్...




**హైదరాబాద్ : ప్రజా స్వేచ్ఛ**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర రైతులకు బిగ్ అలర్ట్. రైతు భరోసా వివరాల నమోదుకు ఈరోజు చివరితేదీ. దింతో ఇప్పటి వరకు కొత్తగా 5 లక్షల అప్లికేషన్లు వచ్చాయి. 2023 - 25 వరకు రాష్ట్రంలో 12 వేల భూములకు రిజిస్ట్రేషన్లు, గత సంవత్సరం 5 లక్షలకుపైగా రిజస్ట్రేషన్లు జరిగినట్లు పేర్కొన్నారు అధికారులు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతుభరోసా లబ్ధిదారుల నమోదు ప్రక్రియ చేపడుతున్నారు ఏఈఓలు. ఈ తరుణంలోనే రైతు భరోసా వివరాల నమోదుకు ఈరోజు చివరి తేదీ అని అధికారులు తెలిపారు. దీనికోసం ఏఈఓ నుంచి ఫామ్ తీసుకొని వివరాలను నమోదు చేసుకోవాలి. rythubharosa.telangana.gov.in నుంచి కూడా ఈ ఫామ్ డౌన్లోడ్ చేసుకోవచ్చు

# యోగా బూట్ క్యాంప్ విజయవంతం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రజా స్వేచ్ఛ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలరీస్ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కోల్ ఇండియా అనుబంధ బొగ్గు సంస్థల ఆధ్వర్యంలో జూన్ 14 నుండి 20 వరకు కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో యోగా బూట్ క్యాంపులు నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా ఈరోజు, జూన్ 20, 2025న కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది కోసం ఒక ప్రత్యేక యోగా బూట్ క్యాంప్ నిర్వహించారు. ఈ యోగా శిక్షణ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ శిక్షణా శిబిరాలను రూపొందించినట్లు తెలిపారు. యోగా శారీరక, మానసిక ప్రశాంతతను, దృఢత్వాన్ని పెంపొందించడంలో సహాయపడుతుందని, ఉద్యోగుల శ్రేయస్సును మెరుగుపరచి, ఆరోగ్యకరమైన



వాతావరణాన్ని కల్పించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఉద్యోగులందరూ యోగా ప్రాముఖ్యతను తెలుసుకొని, రోజువారీ కార్యకలాపాలలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉద్యోగులకు సూచించారు."యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాక, మానసిక స్థిరత్వాన్ని కలిగించే సాధనం. ఇది ఉద్యోగుల్లో ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంపొందించి, పనితీరును మెరుగుపరుస్తుంది" అని షాలేం రాజు అన్నారు., జూన్ 21, 2025న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలకు ఉద్యోగులందరూ తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే, జి.ఎం. కార్యాలయంలో ఉదయం 8:00 గంటల నుండి యోగా కార్యక్రమం ఉంటుందని, జి.ఎం. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్ట్ కార్మికులు ఈ కార్యక్రమానికి హాజరై అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.ఎం.తో పాటు జి.ఎం. ఆఫీస్ పిట్ సెక్రటరీలు ఏఐటీయూసీ యూనియన్ కే. సౌజన్య, ఐఎన్‌టీయూసీ యూనియన్ సిహెచ్. సాగర్, ఎస్.ఓ.టు జి.ఎం. జి.వి. కోటిరెడ్డి, పద్మావతి ఖని ఏజెంట్ బి. రవీందర్, ఏరియా ఇంజనీర్ కే. సూర్యనారాయణ రాజు, డీజీఎం (పర్సనల్) గామలపాటి వెంకట మోహన్ రావు, డీజీఎం (ఐఈడి) ఎన్. యోహాను, వివిధ విభాగాల అధిపతులు టి. సత్యనారాయణ, బి. మాధవ్, డివైపీఎం హరీష్ గోవర్ధన్, సీనియర్ పీఓలు మజ్జి మురళి, ఎండి. మతీన్ హుస్సేన్, అధికారులు రాధా నాగభూషణం, వి. మణి, ఉమామహేశ్వరి ఇతర ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకి విద్యాజ్ఞానంతో పాటు మానసిక ఉల్లాసం అనివార్యం

-గేమ్స్ లలో గాయమైన విద్యార్తికి స్వయాన ప్రథమ చికిత్స చేసిన ప్రిన్సిపాల్.

-అనంతరం హాస్పిటల్ తరలింపు

-ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు.

-ఇటువంటి ఉపాధ్యాయులు అరుదుగా ఉంటారంటున్న పట్టణ ప్రజలు.




**ప్రజా స్వేచ్ఛ ,వర్ధన్నపేట**

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ గురువుగా ఔధార్యాన్ని చాటుకున్నారు. విద్యార్థులకి విద్యాజ్ఞానం తో పాటు మానసిక ఉల్లాసం అనివార్యం అంటున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలు దేహధారుఢ్య వ్యాయామంలో భాగంగా పాఠశాలలో క్రీడలు నిర్వహిస్తున్న క్రమంలో ఓ విద్యార్థి కుడి కాలుకి గాయం కావడంతో తక్షణమే స్పందించి వృత్తి రీత్యా ప్రిన్సిపాల్ అయినా స్వయాన విద్యార్థి కాలుకి ప్రథమ చికిత్స చేసి స్కూల్ (వైద్యునిగా)పేరు ప్రఖ్యాతలు పొందారు.ఈ విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఆటపాటలలో విద్యార్థులకి గాయాలైతే ఏ ఉపాధ్యాయుడైనా ప్రథమ చికిత్స తదితర చికిత్సల నిమిత్తమై ఆసుపత్రులకి తరలించే ఉపాధ్యాయులని చూశామని, కానీ అన్ని తానై స్వయాన ఓ ప్రిన్సిపాల్ విద్యార్థికి ప్రథమ చికిత్స చేయడం పట్ల ఇటువంటి ఉత్తమ ఉపాధ్యాయున్ని కలిగిన స్కూల్ యాజమాన్యం గర్వించాలని,ఇటువంటి సేవగుణమున్న ఉపాధ్యాయులు అరుదుగా ఉంటారంటున్న పట్టణ ప్రజలు ప్రిన్సిపాల్ సేవలపట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.

## అనాధాశ్రమానికి రూ లక్ష అందజేసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

**కూకట్పల్లి, ప్రజా స్వేచ్ఛ**



సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు సమాజాభివృద్ధికి చేయగలిగినంత కృషి చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. మూసాపేట హెచ్పి రోడ్ లోని సాయి సేవా సంఘం ఆహ్వానం మేరకు అనాధ పిల్లల ఆశ్రమంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటలు, కళలు, వివిధ నృత్యాల్లో తమ ప్రతిభ పాటవాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ చిన్నారుల క్రమశిక్షణ అహుతులను విశేషంగా ఆకట్టుకుంది. సాయి సేవా సంఘం చిన్నారులను తీర్చిదిద్దుతున్న విధానాన్ని రమేష్ అభినందించారు. అనాధ పిల్లల పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పరిస్థితులపై చెల్లించిన రమేష్ తనవంతుగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అప్పటికప్పుడే ప్రకటించారు. దీనిపై ఆశ్రమ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. వారు రమేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘ ప్రతినిధులు ప్రదీప్, అరుణ, సుశీల, నాయకులు లక్ష్మయ్య, శివ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ ఆధ్వర్యంలో యోగా వారోత్సవాలు

**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ...**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ దినోత్సవం (2025) పురస్కరించుకొని నిర్వహిస్తున్న యోగ వారోత్సవాలలో భాగంగా గ్రీన్ పార్క్ కాలనీ, కర్మన్ఘాట్ లోని గీతం ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్కూల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమ నిర్వాహకులు శ్రీ అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఫోటోకు పూలు, కొబ్బరి కాయలు, హారతి సమర్పించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యోగా గురువులు విజయ ప్రతాప్ మహారాజ్ అల్లాడి పరమేశ్వర్ విద్యార్థులు




ఉపాధ్యాయులు తో యోగాసనాలు చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పి శ్రీనివాస్ బోర్డు మెంబర్స్ సిహెచ్ వినయ్ కుమార్ పి కావ్య పి శ్రీలత ఏ మాధవి తదితర టీచర్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు టి సురేందర్ అయ్యాళ్వార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ద్వారా శరీరము, మనస్సు శుద్ధి చేయబడి జ్ఞానమును పొందేందుకు కావాల్సిన మానసిక శక్తిని ప్రసాదిస్తుంది అన్నారు. ఇది మన సనాతన ధర్మ సూత్రాలలో ఒకటి నేడు అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యతను సంతరించు కోవడం గర్వించ దగిన విషయం అన్నారు. అందరూ తమ సమయానుకూలంగా కొంత సమయాన్ని యోగా కోసం కేటాయించి ఆరోగ్య వంతంగా ఉండాలని ఆశిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన టీటీడీ, హిందూ ప్రచార పరిషత్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామీణ వైద్యులపై ఐఎంఏ దారులను నిలిపివేయాలి

**వేముల వీరేశం కు వినతి పత్రం అందజేసిన సుశ్రుత గ్రామీణ వైద్యులు**



**శాలిగౌరారం ,ప్రజా స్వేచ్ఛ**

శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సీనియర్ సుశ్రుత గ్రామీణ ప్రథమ చికిత్స వైద్యడలు వీపూరి పరాంకుశం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులపై ఐఎంఏ దాడులు ఆపాలని మరియు ప్రభుత్వ పరంగా గుర్తింపు ఇవ్వాలని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఎంఎల్ఏ కు వినతి పత్రము ఇవ్వడం జరిగినది ఉద్యోగం లేక ఉపాధి దోరగాక కుటుంబాన్ని పోషించుకోవటానికి వైద్య వృత్తిని ఎన్నుకొని ఐదు సంవత్సరములు ఐఎంఏ డాక్టర్ల దగ్గర శిక్షణ పొంది ప్రభుత్వ పరంగా గాని ప్రవేట్ పరంగా గానీ వైద్యసేవలందని మారుమూల గ్రామాలలో 24 గంటలు అందుబాటులో ఉంటూ రాత్రి అనక పగలనకా డబ్బులు ఉన్నా లేకున్నా అనారోగ్య పరిస్థితులు వారికి ఉన్నప్పుడు వైద్య సేవలు అందించి కొంత ఉపశమనం కలిగించి వారిచ్చే డబ్బులతోనే మా కుటుంబాన్ని పోషించుకుంటున్నాం మరియు ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ ఆరోగ్య సేవల గురించి గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము పరోక్షంగా ప్రభుత్వానికి నిరుద్యోగ సమస్యను తగ్గిస్తున్నాము ఈ కార్యక్రమములో సీనియర్ గ్రామీణ ప్రథమ చికిత్స సేవకులు వీ పూరి పరాంకుశం నకిరేకల్ మండల అధ్యక్షులు సామల వెంకటరమణ కార్యదర్శి పెండెం శంకర్ శాలిగౌరారం మండలం సీనియర్ వైద్యులు దునక వెంకన్న మా దు వెంకన్న కట్టంగూరు మండల రాజుల సైదులు సయ్యద్ అజ్మత్ కేతపల్లి మండల మరియు మా తోటి గ్రామీణ వైద్య మిత్రులు రసం సత్తయ్య సతీష్ నరేష్ బెల్లం సత్తి యాదవ్ ధనంకొండ అంజయ్య వీరస్వామి వెంకటేశ్వర్లు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**ఎస్సై కె. శ్వేత.**



**మంచిర్యాల జిల్లా,ప్రజా స్వేచ్ఛ**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని భీమారం ఎస్సై కె. శ్వేత అన్నారు. భీమారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను వివరించారు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం అని ఇవి పాటించడం వల్లనే ప్రమాదాలు నివారించవచ్చు అని,చిన్నప్పటి నుండే పిల్లల్లో శ్రమశీలత, నిబంధనలు పాటించే అలవాటు పెంపొందాలి" అని పేర్కొన్నారు.

## శరణార్థులను ఆదుకోవాలి

**మంచిర్యాల ,ప్రజా స్వేచ్ఛ**



శరణార్థులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, అడ్వకేట్ మోతే రాజలింగు పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం సందర్భంగా మంచిర్యాల ఎస్ ఆర్ ఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... యుద్ధాలు, హింస, లేదా ఇతర కారణాల వల్ల తమ దేశాలను వదిలి వలస వచ్చిన ప్రజలకు ఆహారం, నీరు, వసతి, వైద్య సహాయం,విద్యను అందించి వారికి ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని ఆయన అన్నారు.శరణార్థుల చట్టపరమైన న్యాయపరమైన హక్కులను కాపాడే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.వారు సమాజంలో కలిసిపోయేలా మరియు సమాన అవకాశాలు పొందేలా చూడాలన్నారు. వారిని సామాజిక దృక్పథంతో అర్థం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎస్.ఆర్.ఏ రాష్ట్ర నాయకులు సైకాలజిస్ట్ డాక్టర్ అంబాల సమ్మయ్య, జిల్లా నాయకుడు కాంపెల్లి హరి చరణ్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# నిధులు కేటాయించినా రంగధాముని చెరువు అభివృద్ధి లో జాప్యం విడనాడాలి

**అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్పల్లి ,ప్రజా స్వేచ్ఛ**



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలాజీ నగర్ డివిజన్లోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ముందుగా కాముని చెరువు సుందరీకరణ పనులను స్వయంగా పరిశీలించి అవసరమైతే హౌసింగ్ బోర్డ్ స్థలాన్ని సేకరించి అత్యంత సుంద రీకరణంగా తీర్చిదిద్దాలని కబ్జా అవుతున్న స్థలాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.. అలాగే బతుకమ్మ కుంటలు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అనంతరం రంగదాముని (ఐడియల్) చెరువు వద్ద ఆ ప్రాంతాన్ని అంతటినీ పరిశీలించి ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 19 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి సుందరీకరణ పనులు చేపట్టామని ఇందులో భాగంగానే ఇప్పటికే అత్యంత సుందరంగా కొంత ప్రాంతాన్ని తీర్చిదిద్దామని దాన్ని కూడా కనీసం పట్టించుకున్న పాపాన పోవట్లేదని.ఎన్నిసార్లు చెప్పినా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. అలాగే మిగిలిన అసంపూర్తిగా ఉన్న పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు.. అనంతరం వివేక్ నగర్ లోని కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన అసోసియేషన్ సభ్యులు, అధికారుల సమీక్ష సమావేశంలో అసోసియేషన్ సభ్యుల అందించిన వినతి పత్రాలు స్వీకరించి వారి సమస్యలను సంబంధిత అధికారులకు అందించారు. శక్తి నగర్, హబీబ్ నగర్, రోడ్ నెంబర్ వన్ వద్ద త్వరలోనే డ్రైనేజ్ సమస్య పూర్తి చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. సేవాలాల్ నగర్ లోని సిసి రోడ్డు పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు.ఈ నేపద్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బాలాజీ నగర్ లో నూతన ధోభీ ఘాట్ కొరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ..అలాగే వీధిలైట్లు ఒక నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు ఇచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని నిధులు కొరత ఉంటే తనకు తెలపాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాలు బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ ,అన్ని విభాగాల అధికారులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# చుంచుపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సమావేశాలు

**-పాల్గొన్న ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘు రాంరెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం, ప్రజా స్వేచ్ఛ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (చుంచుపల్లి ) చుంచుపల్లి మండలంలోని నందాతండా, ధన్ బాద్, గౌతంపూర్, రుద్రంపూర్, పెనగడప గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ రామ సహాయం రఘు రాంరెడ్డి పాల్గొన్నారు. మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, పెదబాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆత్మీయ సమావేశంలో ఎంపి మాట్లాడుతు కాంగ్రెస్ పథకాలను వివరించారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేసి ఇంకా ముందుకు తీసుకుపోవడానికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాలలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో దగా పడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టే విధంగా మేనిఫెస్టోను రూపొందించడమే కాక వాటిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలియచేయడానికి సంతోషిస్తున్నామన్నారు. వివిధ వర్గాలను, సంఘాలను, సంస్థలను వ్యక్తులను సంప్రదించి, వారి సమస్యలను విశ్లేషించి ఓ తేజోవంతమైన మరియు సమగ్ర సుస్థిర తెలంగాణాను అభివృద్ధి పరచే విధంగా ముందుకు వెళుతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లోని ప్రతీ హామీని తప్పకుండా అమలుచేసి తెలంగాణ ప్రజల భవిష్యత్తును బంగారు బాటలో ముందుకు నడిపిస్తామని యావత్తు తెలంగాణ సమాజానికి హామీ ఇస్తున్నామని తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో చుంచుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంతోటి పాల్, సుజాతనగర్ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, కాంగ్రెస్ నాయకుడు జేవిఎస్ చౌదరి, రైల్వే బోర్డు సభ్యులు వై శ్రీనివాస్ రెడ్డి, టెలికాం బోర్డు సభ్యులు బోదాసు కనకరాజు, ఆర్టీఏ బోర్డు సభ్యులు బాదర్ల జోషి, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్స్ ఎండి రజాక్, ఎస్ పితాంబరం, కాంగ్రెస్ నాయకులు బాల పాసి, తలుగు అనిల్, రావి రాంబాబు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ శ్రేణులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు మహిళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యోగా బూట్ క్యాంప్ విజయవంతం

**భద్రాద్రి కొత్తగూడెం ,ప్రజా స్వేచ్ఛ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలరీస్ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కోల్ ఇండియా అనుబంధ బొగ్గు సంస్థల ఆధ్వర్యంలో జూన్ 14 నుండి 20 వరకు కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో యోగా బూట్ క్యాంపులు నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా ఈరోజు, జూన్ 20, 2025న కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది కోసం ఒక ప్రత్యేక యోగా బూట్ క్యాంప్ నిర్వహించారు.ఈ యోగా శిక్షణ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ శిక్షణా శిబిరాలను రూపొందించినట్లు తెలిపారు. యోగా శారీరక, మానసిక ప్రశాంతతను, దృఢత్వాన్ని పెంపొందించడంలో సహాయపడుతుందని, ఉద్యోగుల శ్రేయస్సును మెరుగుపరచి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఉద్యోగులందరూ యోగా ప్రాముఖ్యతను తెలుసుకొని, రోజువారీ కార్యకలాపాలలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉద్యోగులకు సూచించారు."యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాక, మానసిక స్థిరత్వాన్ని కలిగించే సాధనం. ఇది ఉద్యోగుల్లో ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంపొందించి, పనితీరును మెరుగుపరుస్తుంది" అని షాలేం రాజు అన్నారు., జూన్ 21, 2025న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలకు ఉద్యోగులందరూ తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే, జి.ఎం. కార్యాలయంలో ఉదయం 8:00 గంటల నుండి యోగా కార్యక్రమం ఉంటుందని, జి.ఎం. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్ట్ కార్మికులు ఈ కార్యక్రమానికి హాజరై అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జి.ఎం.తో పాటు జి.ఎం. ఆఫీస్ పిట్ సెక్రటరీలు ఏఐటీయూసీ యూనియన్ కే. సౌజన్య, ఐఎన్టీయూసీ యూనియన్ సిహెచ్. సాగర్, ఎస్.ఓ.టు జి.ఎం. జి.వి. కోటిరెడ్డి, పద్మావతి ఖని ఏజెంట్ బి. రవీందర్, ఏరియా ఇంజనీర్ కే. సూర్యనారాయణ రాజు, డీజీఎం (పర్సనల్) గామలపాటి వెంకట మోహన్ రావు, డీజీఎం (ఐఈడి) ఎన్. యోహాను, వివిధ విభాగాల అధిపతులు టి. సత్యనారాయణ, బి. మాధవ్, డివైపీఎం హరీష్ గోవర్ధన్, సీనియర్ పీఓలు మజ్జి మురళి, ఎండి. మతీన్ హుస్సేన్, అధికారులు రాధా నాగభూషణం, వి. మణి, ఉమామహేశ్వరి ఇతర ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# బిజినెస్

## మార్కెట్లోకి వివో వై400 ప్రో 5జీ.. ప్రారంభ ధర రూ.24,999




చైనాకి చెందిన స్మార్ట్ ఫోన్ బ్రాండ్ అయిన వివో తన వై సిరీస్‌లో సరికొత్త మోడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మిడ్ రేంజ్ 5జీ స్మార్ట్ ఫోన్ అయిన వివో వై400 ప్రో ని శుక్రవారం భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఆండ్రాయిడ్ 15 ఆపరేటింగ్ సిస్టంతో పనిచేసే ఈ ఫోన్ గతేడాది విడుదలైన వివో వై300 ప్రో స్మార్ట్ ఫోన్‌కు అడ్వాన్స్‌డ్ వర్షన్.6.77 అంగుళాల AMOLED డిస్‌ప్లే కలిగిన ఈ స్మార్ట్ ఫోన్ మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ప్రాసెసర్, ఆంగ్రాయిడ్ 15 ఆపరేటింగ్ సిస్టం, 50 మెగాపిక్సెల్ డ్యూయల్ రియర్ కెమెరా, 32 MP ఫ్రంట్ కెమెరా, 90 వాట్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్, 5500 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఆకర్షణీయమైన ఫీచర్లతో ఇది అందుబాటులోకి వచ్చింది. ఇందులో 3d కర్వ్‌డ్ డిస్‌ప్లే, ఆప్టికల్ ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 5జీ నెట్‌వర్క్ సపోర్ట్, IP65 డస్ట్ అండ్ వాటర్ రెసిస్టెన్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. దీని ధర విషయానికొస్తే బేస్ వేరియంట్ అయిన 8 జీబీ ర్యామ్0128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ మోడల్ ధర రూ.24,999 కాగా, 8 జీబీ ర్యామ్0256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ మోడల్ ధర రూ.26,999గా కంపెనీ నిర్ణయించింది. ఈ ఫోన్ జూన్ 27 నుంచి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, వివో ఇండియా ఆన్‌లైన్ స్టోర్, ఆఫ్‌లైన్ స్టోర్లలో అందుబాటులో ఉంటుంది. ప్రీ బుకింగ్‌లు నేటి నుంచే ప్రారంభమవుతాయి. మిడ్ రేంజ్ 5జీ స్మార్ట్ ఫోన్ అయిన వివో వై400 ప్రో ఫెస్టివల్ గోల్డ్, ఫ్రీ స్టైల్ వైట్, నెబులా పర్పుల్ కలర్

## రూ.7తో 150 కిలోమీటర్ల ప్రయాణం.. మార్కెట్‌ను షేక్ చేస్తున్న నయా ఈవీ




జీలియో భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీలలో ఒకటి. 2021లో ప్రారంభించిన జూలియో భారత మార్కెట్లో లెజెండర్ అనే ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విక్రయిస్తుంది. జీలియో ఇప్పుడు లెజెండర్ ఎలక్ట్రిక్ స్కూటర్‌కు సంబంధించిన అప్‌డేట్ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌ను తాజాగా విడుదల చేసింది. జీలియో లెజెండ్ ఫేస్‌లిఫ్ట్ మొత్తం 3 వేరియంట్లలో లభిస్తుంది. వీటిలో ఒకటి 32 ఏహెచ్ జెల్ బ్యాటరీ వేరియంట్, దీని ధరను రూ. 65,000గా నిర్ణయించారు. దీంతో పాటు 60వాట్స్/30ఏ లిథియం-అయాన్ బ్యాటరీ వేరియంట్ కూడా అమ్మకానికి అందుబాటులో ఉంది. ఈ స్కూటర్ ధరను రూ. 75,000గా నిర్ణయించారు. మూడో వేరియంట్ 74వీ/32ఏ లిథియం-అయాన్ బ్యాటరీ వేరియంట్. దీని ధర రూ. 79,000గా నిర్ణయించారు. జీలియో లెజెండ్ ఫేస్‌లిఫ్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీని ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేయడానికి 1.5 యూనిట్ల విద్యుత్ మాత్రమే అవసరమని కంపెనీ ప్రకటించింది. జీలిలో బ్యాటరీని పూర్తిగా ఛార్జ్ చేసిన తర్వాత అది 150 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ స్కూటర్ చాలా మంచి రైడింగ్ రేంజ్‌గా పరిగణించవచ్చని స్పష్టం చేస్తున్న్నరు. అలాగే జీలియో లెజెండ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌ను ఆపరేట్ చేయడానికి చాలా తక్కువ ఖర్చు అవుతుంది. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీని పూర్తిగా ఛార్జ్ చేయడానికి కేవలం 1.5 యూనిట్ల విద్యుత్ ఖర్చవుతుంది. తమిళనాడులో 400 యూనిట్ల వరకు విద్యుత్తును ఉపయోగించే వారికి ప్రస్తుత టారిఫ్ యూనిట్‌కు రూ. 4.80 మాత్రమే. కాబట్టి జీలియో లెజెండ్ ఫేస్‌లిఫ్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీని పూర్తిగా ఛార్జ్ చేయడానికి కేవలం రూ.7.20 మాత్రమే ఖర్చవుతుంది. ఈ రూ.7.20 ఖర్చుతో మీరు 150 కి.మీ వరకు ప్రయాణించవచ్చు.

## త్వరలోనే వెండి ధర రూ.2 లక్షలను దాటేస్తుంది..!




ప్రస్తుతం బంగారం, వెండి ధరలు ఆకాశన్నంటుతున్నాయి. తులం బంగారం ధర లక్ష రూపాయలు దాటేసింది. ఇక కిలో వెండి ధర విషయానికొస్తే అది కూడా లక్షా ఎప్పుడో దాటేసింది. వెండి ధర గురించి ఒక ప్రముఖ పెట్టుబడిదారుడు, ధనవంతుడైన రాబర్ట్ కియోసాకి ఒక ప్రధాన అంచనా వేశారు. వెండి ఇప్పుడు కిలోకు రూ. 1.10 లక్షలకు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో అయితే రూ.1.20 లక్షలుగా ఉంది. ప్రస్తుత పారిశ్రామిక డిమాండ్, ఆర్థిక పరిస్థితులు మరియు సాంకేతిక పురోగతి కారణంగా వెండి ధర మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంటున్నారు. వెండి ధర త్వరలో రూ.2 లక్షలకు చేరుకుంటుందని, దేశంలోని విశ్లేషకులు దీనిపై పరిశోధనలు చేస్తున్నారని రాబర్ట్ కియోసాకి చెప్పిన అంచనాలు రిటైల్ పెట్టుబడిదారులలో, మార్కెట్ పరిశీలకులలో సంచలనం సృష్టించాయి. వెండి ధరలు రూ.110,000కి చేరుకున్న తర్వాత కియోసాకి ఈ అంచనాకు వచ్చారు. కియోసాకి వ్యాఖ్యలు దీర్ఘకాలిక బేరిష్ దృక్పథాన్ని సూచిస్తున్నప్పటికీ, భారతదేశంలోని మార్కెట్ నిపుణులు వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

---

## శతక్కొట్టిన గిల్, యశస్వీ.. తొలి టెస్టులో టీమిండియా భారీస్కోర్..!




ఇంగ్లండ్ పర్యటనలో సీనియర్లు లేకున్నా సరే తొలి టెస్టులో భారత జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. లీడ్స్‌లోని హెడింగ్లే మైదానంలో ప్రత్యర్థి బౌలర్లకు పీడకలను మిగిలిస్తూ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(127 నాటౌట్), యశస్వీ జైస్వాల్(101) సెంచరీలతో కదం తొక్కారు. వైస్ కెప్టెన్ రిషభ్ పంత్(65 నాటౌట్) సైతం మెరుపు హాఫ్ సెంచరీతో బాదగా.. తొలి రోజే మూడొందలు కొట్టేసింది టీమిండియా. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన గిల్ భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి భారత్ 3 వికెట్ల నష్టానికి 359 రన్స్ చేసింది. దంచికొట్టిన ఈ ఇద్దరూ క్రీజులో ఉండడంతో హెడింగ్లే టెస్టులో గిల్ సేన పట్టుబిగించడం ఖాయం అనిపిస్తోంది. హెడింగ్లే టెస్టులో భారత జట్టు పట్టుబిగించే దిశగా సాగుతోంది. టాస్ ఓడిన టీమిండియాకు ఓపెనర్లు ఓపెనర్ యశస్వీ జైస్వాల్(101), కేఎల్ రాహుల్ (42) శు భారంభమిచ్చారు. తొలి వికెట్‌కు 91 రన్స్ జోడించి ఇంగ్లండ్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. తొలి సెషన్‌లో చెలరేగి ఆడిన ద్వయాన్ని బ్రాండన్ కర్సే విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్(0) స్టోక్స్ వెనక్కి పంపాడు. సాయి వెనుదిరిగాక యశస్వీ జతగా గిల్ జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. బౌండరీలతో ఇంగ్లండ్ బౌలర్లను పరుగులు పెట్టించిన ఈ జోడీ మూడో వికెట్‌కు 130 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. ఐదో సెంచరీ బాదిన యశస్వీని టీ సెషన్ తర్వాత స్టోక్స్ బౌల్డ్ చేశాడు. అయినా సరే గిల్ పట్టుదలగా ఆడాడు. రిషభ్ పంత్(48 నాటౌట్), గిల్ నాలుగో వికెట్‌కు 138 రన్స్ చేసి.. స్టోక్స్ సేనను డీలా పడేలా చేశారు.

### నాలుగో భారత కెప్టెన్

కెప్టెన్‌గా ఆడుతున్న తొలి ఇన్నింగ్స్‌లోనే వంద కొట్టిన నాలుగో భారత క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు గిల్. హెడింగ్లేలో చిరస్మరణీయ సెంచరీ బాదిన అతడు విజయ్ హజారే, సునీల్ గవాస్కర్, విరాట్ కోహ్లీల సరసన చేరాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో టీమిండియా కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే సెంచరీ హీరో రికార్డు విజయ్ హజారే పేరిట ఉంది. 1951లో ఇంగ్లండ్‌పై ఢిల్లీ మైదానంలో శివాలెత్తిన హజారే 164 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. 1976లో పగ్గాలు అందుకున్న సునీల్ గవాస్కర్ న్యూజిలాండ్ గడ్డపై 116 రన్స్‌తో చరిత్ర సృష్టించాడు. విరాట్ కోహ్లీ 2014లో ఆస్ట్రేలియాపై (115) సెంచరీతో గర్జించాడు.

---

# స్పోర్ట్స్

## ధోని, విరాట్‌ల సరసన శుభ్మన్ గిల్..

### సక్సెస్ ఫుల్ కెప్టెన్‌గా మారే ఛాన్స్.. కారణం ఏంటో తెలుసా?



రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత, శుభ్‌మన్ గిల్‌ను భారత టెస్ట్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా నియమించారు. ఈసారి గిల్ నాయకత్వంలో, భారత జట్టు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ లేకుండా ఇంగ్లాండ్‌తో పోటీ పడనుంది. ఈ అనుభవజ్ఞులైన ఆటగాళ్లు జట్టులో లేకపోవడం కొత్త కెప్టెన్‌పై ఒత్తిడిని పెంచుతోంది. కానీ అతను దాని గురించి పెద్దగా ఆందోళన చెందడం లేదు. అతను యువ ఆటగాళ్లపై పూర్తి నమ్మకం కలిగి ఉన్నాడు. దీంతో పాటు మరొక యాదృచ్ఛికం ఉంది. దాని కారణంగా గిల్ విజయవంతమైన కెప్టెన్‌గా మారగలడు. ఇది గతంలో మహేంద్ర సింగ్ ధోని, విరాట్ కోహ్లీ విషయంలో జరిగింది. ఇప్పుడు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విషయంలో కూడా అదే యాదృచ్ఛికం జరగబోతోంది.

### ఆ యాదృచ్ఛికం ఏమిటంటే?

2020లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్ ద్వారా అరంగేట్రం చేసిన శు భగన్ గిల్ ఇప్పటివరకు టీం ఇండియా తరపున 32 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. తన కెరీర్‌లో 33వ మ్యాచ్‌లో అతను టీం ఇండియాకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. అంతకుముందు, మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ 32 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన తర్వాత 33వ మ్యాచ్‌లో కూడా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. నేడు వారిద్దరూ భారత జట్టుకు అత్యంత విజయవంతమైన కెప్టెన్ల జాబితాలో చేరారు. ఇప్పుడు ఈ యాదృచ్ఛికం శుభ్‌మన్ గిల్ విషయంలో కూడా జరిగింది. అటువంటి పరిస్థితిలో, అతను విజయవంతమైన కెప్టెన్‌గా కూడా మారగలడు. కానీ, ఇందుకోసం ఆటగాళ్లను బాగా రాణించేలా ప్రేరేపించాల్సి ఉంటుంది. దీంతో పాటు, అతను స్వయంగా బ్యాట్‌తో భారీగా పరుగులు సాధించాల్సి ఉంటుంది. శుభ్‌మన్ గిల్ 32 టెస్ట్ మ్యాచ్‌ల్లో 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 7 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గతంలో, విరాట్ కోహ్లీ, మహేంద్ర సింగ్ ధోని నాయకత్వంలో టీం ఇండియా అద్భుతంగా రాణించింది.

---

## హాకీ క్రీడాకారులకు బొనాంజా.. ఇకపై నెలనెలా రూ. 25 వేలు..!



భారత హాకీ క్రీడాకారులకు గుడ్‌న్యూస్. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వాళ్ల కోరిక ఫలించనుంది. అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్న ఆటగాళ్లకు ప్రోత్సాహకంగా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బంపర్ బొనాంజా ఇవ్వనుంది. జాతీయ క్యాంప్‌నకు ఎంపికైన పురుష, మహిళా ప్లేయర్లకు ప్రతి నెల అదనంగా రూ.25వేలు చెల్లించనుంది. గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్స్ నెలవారీ సమావేశంలో హాకీ ఇండియా అభ్యర్థనను అంగీకరించిన మంత్రిత్వ శాఖ.. టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం కింద ఈ అలవెన్స్ అందజేస్తామని మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ స్కీమ్ ద్వారా మొత్తంగా 80 మంది (40 మంది పురుషులు, 40 మంది మహిళా క్రీడాకారులు) లబ్ధి పొందనున్నారని హాకీ ఇండియా వెల్లడించింది. హాకీ ప్లేయర్లకు అదనపు భత్యం ఇవ్వాలని హాకీ ఇండియా పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్ సమావేశంలో చర్చ జరిగింది. ఆటగాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నెల నెలా రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. ఫామ్, ఫిట్‌నెస్.. ఈ రెండు అంశాల ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేస్తాం అని మంత్రి మాండవీయ వెల్లడించారు. అంతేకాదు ఈ సమావేశంలో కోర్ గ్రూప్ అథ్లెట్లకు ప్రతి నెల రూ.50 వేలు ఇవ్వాలని తీర్మానించామని ఆయన తెలిపారు. హాకీ ఆటగాళ్లకు నెలనెలా రూ.25 వేలు ఇవ్వడం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు ఖర్చు చేయనుంది.



# ఆడపులికి క్లీంకార పేరు..

## నెహ్రూ జూ పార్క్ బృందానికి థాంక్స్ చెప్పిన ఉపాసన

మెగా కోడలు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ బృందానికి ధన్యవాదాలు తెలిపింది. జూలో ఉన్న ఒక ఆడపులికి తన కూతురి పేరు క్లీంకార అని పెట్టిన సందర్భంగా తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రత్యేక పోస్ట్ పెట్టింది. ఒక సంవత్సరం క్రితం, అది కేవలం ఒక చిన్న పులి పిల్ల. కానీ ఈ రోజు అల్లరి చేసే ఆడపులి గా మారింది. నా కూతురు క్లీంకార పేరునే ఈ పులి కి పెట్టడం చాలా సంతోషంగా ఉంది. ఈ విధంగా ప్రేమాభిమానాలు చూపించిన నెహ్రూ జూలాజికల్ పార్క్ బృందానికి ధన్యవాదాలు. వన్యప్రాణులు అడవిలోనే ఉంటాయని మనం నమ్ముతుంటాం. అదేవిధంగా జంతువులను సంరక్షించే ప్రయత్నాలను సైతం మద్దతు తెలుపుతుంటాం. అని ఉపాసన రాసుకొచ్చింది. అనంతరం ఇద్దరు క్లీంకారలతో కలిసి దిగిన ఫొటోను ఉపాసన పంచుకుంది.నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని పులి పిల్లలను గురువారం ఉపాసన కొణిదెల దత్తత తీసుకుంది. తన కుమార్తె క్లీంకారతో కలిసి జూను సందర్శించిన ఆమె, అక్కడ వివిధ జంతువుల ఎన్‌క్లోజర్లను వీక్షించారు. అనంతరం జూపార్క్ డైరెక్టర్ డా. సునీల్ ఎస్. హిరేమత్‌ను కలిసి పులి పిల్లలను దత్తత తీసుకుంటున్నట్లు తెలియజేశారు. వాటి పోషణకు అవసరమైన నిధులను చెక్కు రూపంలో జూపార్క్ డైరెక్టర్‌కు అందజేశారు.




# 'కరుప్పు' అంటూ వస్తున్న సూర్య..

## టైటిల్ ఫస్ట్ లుక్ రిలీజ్

తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటులలో కథానాయకుడు సూర్య ఒకరు. ఆయన నటించిన ప్రతి సినిమా ఇక్కడ కూడా విడుదలవుతుంది. అంతేకాదు, వైవిధ్యానికి పెద్ద పీట వేస్తూ ఆసక్తికర చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తారు. ఇప్పటికే తెలుగు దర్శకుడు వెంకి అట్లూరితో సినిమా చేస్తున్న సూర్య తమిళ కమెడియన్ ఆర్జే బాలాజీ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. సూర్య 45గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా ఫస్ట్‌లుక్‌తో పాటు టైటిల్‌ను ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమాకు కరుప్పు (నలుపు) అనే టైటిల్ పెట్టినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ మూవీకి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు.



## చిన్న హీరోలతో నటిస్తున్న

# స్టార్ హీరోయిన్లు..

## అస్సలు కారణం ఇదేనట

తాజాగా కీర్తి సురేష్ మరోసారి ఇదే చేస్తున్నారు. మహానటి ఏ ముహూర్తాన చేశారో గాని అప్పటినుంచి కీర్తి సురేష్ కు స్టార్ హీరోలతో ఆఫర్స్ పెద్దగా రావట్లేదు. మహేష్ తో సర్కార్ వారి పాట చేసిన నాని లాంటి మీడియం రేంజ్ హీరోలతో సరిపెట్టుకుంటున్నారు కీర్తి.తాజాగా మరో మెట్టు దిగి సుహాస్ తో జోడీ కడుతున్నారు ఈ బ్యూటీ. గతంలో భోళా శంకర్ లో సుశాంత్, పెద్దన్నలో అరవింద్ కృష్ణ, మిస్ ఇండియాలో నవీన్ చంద్ర తో కలిసి నటించారు ఈ బ్యూటీ.కథ నచ్చితే చిన్న హీరోలతో కూడా నటించడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు కీర్తి సురేష్. ఈ క్రమంలోనే సుహాస్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఉప్పు కప్పురంబు అనే సినిమాలో నటిస్తున్నారు.ఇది ఓటీటీ కోసమే తెరకెక్కిస్తున్నారు. జులై నాలుగిన విడుదల కానుంది ఈ చిత్రం. మరోవైపు నెట్ ఫ్లిక్స్ కోసం అక్క అనే సిరీస్ కూడా చేస్తున్నారు కీర్తి సురేష్. కీర్తి మాత్రమే కాదు స్టార్ హీరోయిన్లు చాలామంది చిన్న హీరోలతో జోడీ కడుతున్నారు ఇప్పుడు. సమంత ఆ మధ్య శకుంతలంలో మలయాళ హీరో దేవ్ మోహన్ తో నటించారు.అదే హీరోతో రెయింబో చేస్తున్నారు రష్మిక. ఇక నవీన్ పొలిశెట్టి తో మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి లో నటించిన అనుష్క క్రిష్ తెరకెక్కిస్తున్న ఘాతి కోసం విక్రమ్ ప్రభు తో జోడీ కట్టారు. మొత్తానికి కథ నచ్చితే చిన్న హీరోలతో జోడీ కడుతున్నారు మన స్టార్ హీరోయిన్లు.

# మెగా ఫోన్ పట్టనున్న చందమామ?

నటి కాజల్ అగర్వాల్ మెగా ఫోన్ పట్టనున్నారు. కెరీర్ పీక్స్ ఉన్నప్పుడే తన చిరకాల మిత్రుడు గౌతమ్ కిచ్లుని పెళ్లాడేసి, వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన ఈ అందాల చందమామ.. 'భగవంత్ కేసరి'తో సెకండ్ ఇన్నింగ్స్ మొదలపెట్టారు. ఆ సినిమా ఘన విజయం సాధించినా ఆ క్రెడిట్ అంతా బాలకృష్ణ, అనిల్ రావిపూడిల ఖాతాలో పడిపోవడంతో కాజల్‌కి మాత్రం ఆ స్థాయి అవకాశం మళ్లీ రాలేదు. ఈ నెలలోనే ఆమె పార్వతీదేవి పాత్రలో నటించిన 'కన్నప్ప' చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే రెండు దశాబ్దాల తన అనుభవాన్నంతా క్రోడీకరించి, ఓ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మించేందుకు కాజల్ సిద్ధమయ్యారని బీటౌన్ టాక్. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికార ప్రకటన విడుదల కానుంది.



# కుబేర సినిమాకు ధనుష్ రెమ్యునరేషన్ ఎంతో తెలుసా..?



తమిళ్ హీరో ధనుష్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కోలీవుడ్ ఇండస్ట్రీలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత హిందీలో వరుస సినిమాలతో నార్త్ అడియన్స్ కు దగ్గరయ్యారు. ఇక ఇప్పుడు తెలుగులోనూ సినిమాలు చేస్తూ టాలీవుడ్ ఇండస్ట్రీలోనూ సత్తా చాటుతున్నారు. ఇప్పటికే సార్ సినిమాతో తెలుగులో భారీ విజయాన్ని అందుకున్న ధనుష్.. ఇప్పుడు కుబేర సినిమాతో మరోసారి వెండితెరపై సందడి చేశారు. డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ధనుష్, నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలు పోషించారు. భిన్నమైన కథాశంతో తెరకెక్కించిన ఈ సినిమాలో ధనుష్ ఇదివరకు ఎప్పుడూ నటించని బిచ్చగాడి పాత్రలో నటించారు. జూన్ 20న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేశారు. శుక్రవారం తెల్లవారుజామున నుంచే కుబేర సినిమాకు పాజిటివ్ రివ్యూస్ వస్తున్నాయి. ముఖ్యం శేఖర్ కమ్ముల డైరెక్షన్, ధనుష్, నాగార్జున, రష్మిక యాక్టింగ్ ఇరగదీశారంటూ రివ్యూస్ ఇస్తున్నారు జనాలు.దాదాపు రూ.120 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు సమాచారం. అయితే ఇప్పుడు ఈ సినిమాకు ధనుష్ తీసుకున్న పారితోషికం గురించి ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది. నివేదికల ప్రకారం ఈ సినిమాకు ధనుష్ రూ.30 కోట్లు పారితోషికం అందుకున్నారని సమాచారం.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492